


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 06-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 258 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# దృఢమైన భారతం కోసం



- పెట్రోల్‌పై భారం
- హోమ్ లోన్స్‌పై వడ్డీ రాయితీ
- ప్రియమైన బంగారం
- రక్షణ రంగానికి 3.18 లక్షల కోట్లు
- 1.25 లక్షల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం
- ఆధార్ కార్డ్‌తో ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్
- మహిళా సంక్షేమానికి ప్రత్యేక కృషి
- రూ.400కోట్లతో నూతన జాతీయ విద్యావిధానం
- గ్రామీణానికి అంతర్జాల సేవలు
- ఎన్‌ఆర్‌ఐలతో పెట్టుబడులు కీలకం
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆమె గం.2.15 నిమిషాలు ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం రెండోసారి బంపర్ మెజార్టీతో అధికారంలోకి వచ్చాక, అలాగే, నిర్మల ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. ఆదాయపన్ను పరిమితిలో మార్పు లేదు. పెట్రోల్, డీజిల్ పైన రూ.1 సెస్ విధిస్తున్నారు. రూ.45 లక్షల హోమ్ లోన్స్ పైన రూ.3.5 లక్షల వరకు వడ్డీ రాయితీ. ఏడాదికి రూ.కోటి దాటిన విత్ డ్రాయల్స్ పైన 2 శాతం వడ్డీ.. ఇలా ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## రక్షణకు రూ. 3.18 లక్షల కోట్లు

దేశ భద్రతకు కీలకమైన రక్షణ రంగానికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేశారు.

గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి రూ. 2.98 లక్షల కోట్లు కేటాయించగా.. 2019-20 ఆర్థిక సంవత్సరంలో దాన్ని రూ. 3.18లక్షల కోట్లకు పెంచారు. అయితే ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపులనే ఈ బడ్జెట్‌లోనూ కొనసాగించారు.

మొత్తం కేటాయింపుల్లో కొత్త ఆయుధాలు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర సైనిక హార్డ్‌వేర్ పరికరాల కొనుగోలుకు ఉద్దేశించిన పెట్టుబడి వ్యయం కోసం రూ. 1,08,248కోట్లు కేటాయించారు. వేతనాల చెల్లింపు, సైనిక వ్యవస్థల నిర్వహణ కోసం ఉద్దేశించిన రెవెన్యూ వ్యయాన్ని రూ. 2,10,682కోట్లుగా ఖరారు చేశారు.

కాగా.. ఇందులో పింఛను చెల్లింపులను కలపలేదు.

పింఛను చెల్లింపుల కోసం రూ. 1,12,079కోట్లు కేటాయించారు. ఇవి కూడా కలిపితే రక్షణ బడ్జెట్ రూ. 4.31లక్షల కోట్లుగా ఉంటుంది.

## ఐదేళ్లలో 1.25 లక్షల కిలోమీటర్ల రోడ్లు

రెండోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో 5 ట్రిలియయన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను అందుకోవాలని నిర్ణయించింది. తొలిసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గత ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న సంస్కరణల ఫలితంగా అదనంగా ఒక ట్రిలియన్ డాలర్లను జోడించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను అందుకుంటామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లను చేరుకుంటామని తెలిపారు. అందు కోసం మౌలికవసతులు, డిజిటల్ ఎకానమీ, ఉద్యోగ కల్పనపై భారీగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఆధార్‌తో ఇన్‌కమ్‌ట్యాక్స్ ఫైలింగ్

ఆదాయపు పన్ను రిటర్నుల ఫైలింగ్ కోసం ఇక మీదట తప్పనిసరిగా పాన్ కార్డు ఉండాల్సిన అవసరం లేదు. ఆధార్ కార్డ్‌తో కూడా ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్ చేయొచ్చు. ఈ నూతన వెసులుబాటును కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. పాన్ కార్డు లేని వారికి ఇది ఊరట కలిగించే విషయమే.

దాదాపు 120 కోట్ల భారతీయుల వద్ద ఆధార్ కార్డులు ఉన్నాయి. పన్నులు చెల్లించే వారి సౌకర్యార్థం.. పాన్‌తో సమానంగా ఆధార్ కార్డును ఉపయోగించేందుకు వీలుగా ప్రతిపాదనలు చేస్తున్నాం. ఇక మీదట పాన్ కార్డు లేకపోయినప్పటికీ ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్‌చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాం. తరువాయి 7లో..

## దేశాభివృద్ధికి నారీ భేరీ తప్పనిసరి

తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. నారీ తు నారాయణి భారతదేశ సంస్కృతి అని పార్లమెంటు సాక్షిగా మరోసారి గుర్తుచేశారు. మహిళల సాధికారిత గురించి వర్ణించేటప్పుడు ఆమె నోటి నుంచి ఆణిముత్యాల్లాంటి పదాలు జాలువారాయి. దేశం మరింత ఎత్తుకు ఎదగాలంటే స్త్రీల అభివృద్ధి తప్పనిసరని నిర్మల స్పష్టం చేశారు. ప్రతి పనిలో వారి భాగస్వామ్యం కచ్చితంగా ఉండాల్సిందేనని వెల్లడించారు. స్వామి వివేకానందుడు ప్రవచించిన మహిళల పరిస్థితి మెరుగవ్వకుండా ప్రపంచం క్షేమంగా ఉండదు. ఒంటి రెక్కతో పక్షి ఆకాశంలో విహరించడం అసాధ్యం అనే వాఖ్యం ఇందుకు నిదర్శనమని ఆమె తెలిపారు.

బడ్జెట్‌లో మహిళలకు కేటాయింపుల గురించి నిర్మల మాట్లాడుతూ వారి పట్ల ప్రభుత్వ వైఖరి మారిందని వెల్లడించారు. మహిళా కేంద్రంగా కాకుండా మహిళా నాయకత్వంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్‌డీయే ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా మహిళల ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్‌ను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇక నుంచి దేశంలోని ప్రతి జిల్లాకు మహిళా స్వయం సహాయక బృందాలను (ఎస్‌హెచ్‌జీ) విస్తరిస్తున్నామని ప్రకటించారు.

మహిళా సాధికారితను పెంచేందుకు, వారిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు స్వయం సహాయ బృందంలోని ఒక మహిళకు ముద్రా పథకం కింద రూ.లక్ష రుణం పొందేందుకు అర్హత కల్పించారు. ఎస్‌హెచ్‌జీలోని ప్రతి మహిళకు జన్‌ధన్ ఖాతాలో పాటు తరువాయి 7లో..

## ఎన్‌ఆర్‌ఐలకు మరిన్ని సౌకర్యాలు

ఉద్యోగం, వ్యాపార కార్యకలాపాల నిమిత్తం విదేశాల్లో ఉంటున్న ప్రవాసులకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని వెసులుబాటులు కల్పించింది. ముఖ్యంగా ఎన్‌ఆర్‌ఐల నుంచి పెట్టుబడులను పెంచే లక్ష్యంతో బడ్జెట్‌లో కీలక అడుగు వేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ పెట్టుబడులకు సంబంధించి ముఖ్య ప్రతిపాదనలు చేశారు. దేశీయ స్టాక్‌మార్కెట్ లేదా ఇతర రూపాల్లో విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) దేశంలో సులభంగా పెట్టుబడులు పెట్టవచ్చు. తరువాయి 7లో..

## దృఢమైన భారతం కోసం..

దృఢమైన భారతం కోసం దృఢమైన ప్రజలే మా నినాదమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఎన్డీయే-2 ప్రభుత్వంలో తొలి కేంద్ర బడ్జెట్‌ను సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై ప్రసంగిస్తూ చాణక్య నీతిని ప్రస్తావించారు. కార్య పురుష కరేన..లక్ష్యం సంపాదయతే అని చాణక్య నీతి చెబుతోంది. అంటే మానవ ప్రయత్నం కచ్చితంగా ఉంటే ఎలాంటి లక్ష్యాలనైనా పూర్తి చేయగలం అని అర్థం అని సీతారామ్ చెప్పారు. తమ ప్రభుత్వం దేశ వృద్ధికి కట్టుబడి ఉందన్నారు. గత ఐదేళ్లలో దేశం వేగంగా అభివృద్ధి చెందింది. మన ఆర్థిక వ్యవస్థ తరువాయి 7లో..




## కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక బడ్జెట్ నిరాశ పరిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి. విజయసాయిరెడ్డి అన్నారు. పార్లమెంట్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా ప్రస్తావన లేదని పెదవి విరిచారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలపై ఏమీ మాట్లాడలేదని, కేంద్ర ప్రభుత్వం ఏపీకి మొండిచేయి చూపిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని నిధులు కేటాయిస్తున్నారని దానిపై స్పష్టత లేదని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏపీ రెవెన్యూ లోటు రూ.60 వేల కోట్ల వరకు పెరిగిందని వెల్లడించారు. ఈ బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం చాలా ఆశలు పెట్టుకుందని, రాష్ట్రానికి తప్పకుండా సహాయం చేస్తామని కేంద్రం కూడా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. పోలవరం, అమరావతిపై నిధుల తరువాయి 7లో..

## బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది



అమరావతి: కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్, దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. వివిధ రంగాల అభివృద్ధి, పేదల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదని ఆయన అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చంద్రబాబు విమర్శలు గుప్పించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల పొదుపు శక్తి పెంచడంతో పాటు రైతులు, మహిళలు, యువతరం ఆశలను నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో అంశాలు లేవన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఈ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది. ప్రత్యేకహోదాతోపాటు విభజన చట్టంలోని అంశాలను పూర్తిగా విస్మరించారు. ఏపీకి ఇవ్వాల్సిన తొలి ఏడాది ఆర్థికలోటు భర్తీలో ఇంకా ఇవ్వాల్సిన దానిపై ఏదీ తేల్చలేదు. రూ.16వేల కోట్ల లోటుకు.. రూ.4వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. మిగిలిన దానిలో తరువాయి 7లో..

## డ్రాపౌట్స్ లేకుండా చూడండి

### విద్యా నిపుణుల కమిటీతో సీఎం భేటీ



అమరావతి : విద్యారంగంలో మార్పులపై నిపుణుల కమిటీతో తన ఆలోచనలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచుకున్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని అధికారులకు సూచించారు. దీంట్లో భాగంగానే అమ్మ ఒడి పథక ప్రాముఖ్యాన్ని అధికారులకు వివరించారు. అమ్మ ఒడి, సంపూర్ణ ఫీజు రియింబర్స్ మెంట్, విద్యార్థులకు బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ కింద తరువాయి 7లో..



# స్వచ్ఛత పక్షోత్సవాలను జయప్రదం చేయండి

**హెచ్.పి.సి.ఎల్ - జివియంసిల భాగస్వామ్యంతో కార్యక్రమాలు**
**పోస్టర్లు, కరపత్రం, ఫ్లూట్ బోర్డుల ఆవిష్కరణ**
**వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం**
**దోమకారక వ్యాధుల నివారణ ద్వారా ఆరోగ్య విశాఖ**
**డ్రైడే పాటించడం ద్వారా మలేరియా, డెంగ్యూ నివారణ**
**జివియంసి కమిషనర్ డా.జి.సృజన**

విశాఖపట్నం: విశాఖ నగర ప్రజలను స్వచ్ఛత పక్షోత్సవాల ద్వారా మరింత చైతన్యవంతం చేయాలని హెచ్.పి.సి.ఎల్-విశాఖ రిఫైనరీ అధికారులను జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. తనఛాంబర్‌లో హెచ్.పి.సి.ఎల్-జివియంసి సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార మాధ్యమాలను, కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లూట్ బోర్డులను బుధవారం ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.37 లక్షలతో వివిధ కార్యక్రమాలను హెచ్.పి.సి.ఎల్ నిర్వహించడం అభినందనీయమని వెల్లడించారు.

వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను దోమకారక వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం నిషేధం, కంపోస్టింగ్, చెట్ల పెంపకం గురించి అవగాహన కల్పించడం ముదావహమని పేర్కొన్నారు. డ్రైడే పాటించడం ద్వారా దోమకారక వ్యాధులైన మలేరియా, డెంగూలు నివారించడానికి స్వచ్ఛత పక్షోత్సవాలు దోహదపడతాయని అభిలషించారు.

హెచ్.పి.సి.ఎల్ సి.యస్.ఆర్ నిధులతో జివియంసిలో నిర్వర్తిస్తున్న స్వచ్ఛ విశాఖ కార్యక్రమానికి చేయూతనిస్తున్నట్లు సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్ తెలిపారు.

కార్యక్రమంలో హెచ్.పి.సి.ఎల్ విశాఖ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రత్నరాజు, కాశీ ప్రసాద్, చీఫ్ మేనేజర్ (పి.ఆర్) యం.యస్.శర్మ, చీఫ్ జనరల్ మేనేజర్ ఎన్.రాజరావు, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# జై.. జై.. జగన్నాథ స్వామి

## వాడవాడలా వైభవంగా జగన్నాథ స్వామి రథోత్సవం



చోడవరం పట్టణంలోని బోళ్ళ వీధి రామాలయంలో..

చోడవరం: పట్టణంలోని బోళ్ళ వీధి రామాలయం ఇంద్రజ్యుమ్నం వద్ద జగన్నాథస్వామి వారి దశావతారాలలో భాగంగా శుక్రవారం మొదటి రోజున మత్స్యావతార అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం రామకృష్ణమాచార్యులు, సుదర్శనం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణవాసులతో పాటు సరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా రెండవ రోజు శనివారం (నేడు) జగన్నాథస్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు అర్చకులు తెలిపారు.

# నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నరసింగరావు

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌కి ప్రధానమైన కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు పోలవరం కోసం, అమరావతి నిర్మాణంకోసం నిధులు కేటాయింపులోగాని, విభజన చట్టంలోని కడప స్టీల్‌ప్లాంట్, దుగ్గిరాజుపట్నం పోర్టుల విషయం కోసం స్పష్టమైన ప్రకటన లేకపోవడం, స్పెషల్ కేటగిరి స్టేటస్‌ని బడ్జెట్‌కి ముందే పూర్తిగా నిరాకరించారు.

కేంద్ర బడ్జెట్ బడా పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చింది. ప్రత్యక్ష పన్నులు 30శాతం నుండి 25శాతం తగ్గించడం వలన 93.3శాతం పరిశ్రమలకు వర్తించేవిదంగా 400కోట్లు టర్నోవర్ పరిశ్రమలకు వర్తింపు చేసింది. వ్యవసాయ రంగంలో రైతాంగానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు ప్రస్తవించలేదు. ప్రధానంగా ఋణాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వడంలో ప్రస్తావన లేదు. రైతుల ఆర్థికపరిస్థితి మెరుగుపడకుండా ఆర్థికవ్యవస్థ మెరుగుపడటం అసాధ్యం. 5 ట్రిలియన్లకు పెంచే విధంగా అర్థికవ్యవస్థని అభివృద్ధి చేస్తామని పేరుతో విదేశీ పెట్టుబడులను విస్తృతంగా ఆకర్షించడం ఈ బడ్జెట్‌లో ప్రధాన అంశం

ప్రైవేటీకరణ పేరుతో రైల్వేరంగతో సహా కేంద్ర ప్రభుత్వరంగాలు వేగంగా ప్రవేటీకరిస్తామని ప్రకటించారు. బడ్జెట్ ప్రవేశానికి ముందు రైల్వే క్రాసింగ్‌లు అన్ని రిలియన్స్ కంపెనీకి అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ బడ్జెట్‌లో లక్ష కోట్లకుపైగా కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల పెట్టుబడుల వాటాలను ప్రైవేటీకరిస్తామని నిర్ణయించారు. ప్రజల, దేశ సంపదను ప్రైవేటీకరించి, పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడమే ఈ బడ్జెట్‌లో కీలక అంశం. దీని వలన ప్రజలపై భారం, అసమానతలు, నిరుద్యోగం పెరుగుతాయి. ప్రజావ్యతిరేకమైన ఈ బడ్జెట్‌ను సిపిఎం వ్యతిరేకిస్తున్నది.

# ఉపకార వేతనాలకు 12 మంది విద్యార్థుల ఎంపిక

నర్సీపట్నం: నర్సీపట్నం వివేకానంద కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివిన 12 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ ఉపకార వేతనానికి లాలం శ్రావణి ఎంపికయ్యారని, డిగ్రీలో రూ.30వేలు, పిజిలో రూ.20వేలు ఆమెకు అందుతాయని కరస్పాండెంట్ దొరబాబు తెలిపారు. మరో 11 మంది ఎంహెచ్‌ఆర్‌డి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి రూ.30వేల చొప్పున అందుతాయని వివరించారు.

# పేకాట, కోడిపందాలపై నిఘా

మాకవరపాలెం: పేకాట, కోడిపందాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని మాకవరపాలెం ఎస్సై కరక రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వీటిని ఎక్కడ నిర్వహించినా సమాచారం ఇవ్వాలన్నారు. మండలానికి ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో శక్తి టీం కేటాయించినట్లు చెప్పారు. ఎక్కడైనా విద్యార్థినులు, మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేసినా, ర్యాగింగ్‌కు పాల్పడినా వెంటనే శక్తి టీంకు సమాచారం ఇవ్వవచ్చునని తెలిపారు. 6309917171 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే శక్తి టీం అక్కడకు చేరుకుంటుందన్నారు. నిరంతరం ఈ టీం అందుబాటులో ఉంటుందన్నారు.

# కక్షసాధింపుమాని బకాయిలు చెల్లించాలి

## ఎమ్మెల్యే నాగిరెడ్డి దగ్గిర మొరపెట్టుకున్న రిటైర్డ్ షిప్‌యార్డ్ ఉద్యోగుల సంఘ సభ్యులు



గాజువాక : హిందుస్తాన్ షిప్ యార్డ్ సంస్థలో పదవీవిరమణ చేసి నేటికి పదిసంవత్సరాలు కావస్తున్న తమకు రావలసిన బకాయలు పూర్తిగా చెల్లించక సంస్థ యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగులపై కక్ష సాధిస్తోందని మాజి ఉద్యోగుల సంఘ సభ్యులు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వద్ద తమ అవేదనను తెలియజేశారు . శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డి నివాసంలో మాజి ఉద్యోగుల సంఘం సభ్యులు తుంపాల తాతారావు అధ్వర్యంలో సుమారు 100 మంది మాజి ఉద్యోగులు తమకు రావలసిన బకాయలను సంస్థ ఇప్పించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే నాగిరెడ్డిని అభ్యర్ధించారు. ఈ సంధర్భంగా సంఘం సభ్యులు తుంపాల తాతారావు మాట్లాడుతూ హిందుస్థాన్ షిప్ యార్డ్ సంస్థలో 2009 సంవత్సరం నుండి 2014 సంవత్సరం వరకు సుమారు 15 వందల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందేరాని తెలిపారు. ఐతే పదవీ విరమణ పొందిన ఈ 15 వందల మందికి నాడు పిఎఫ్ , గ్రాడ్యూటీ నగదు మాత్రమే చెల్లించి చేతులు దులిపేసుకున్నారని అన్నారు . ఇంకా వీరికి వేతన ఒప్పంద బకాయిలు ,2015 ఎప్రిల్ నుండి నేటివరకు లీవ్ ఎన్‌కాష్‌మెంట్ ఇవ్వలేదని వాపోయారు .

ఒక్కక్క విశ్రాంతి ఉద్యోగికి సుమారుగా రూ . 2 లక్షల నుంచి రూ . 6 లక్షల రూపాయలవరకు రావాలని తెలిపారు. అంటే పదవీవిరమణ పొందిన 15 వందల మందికి దాదాపుగా రూ . 50 కోట్ల రూపాయలు విశ్రాంతి ఉద్యోగులకు కంపెనీ ఇవ్వాలని ఐతే ఈ బకాయలకోసం కంపెనీ చుట్టూ చెప్పులు అరిగిపోయాలా తిరుగుతున్నా , కంపెనీ గేట్ వద్ద నిరసనలు , ధర్నాలు నిర్వహించినా ఇవియేవి పట్టించుకోకుండా కంపెనీ ఉన్నతాధికారులు ఎదో ఒక సాకు చెప్పి కలయాపన చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు . సంఘం అధ్యక్షులు బి సత్యానందం మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు రావలసిన బకాయలు రాక ఆర్థికంగా చాలమంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వారి సమస్యలకు ఎమ్మెల్యే నాగిరెడ్డి సానుకూలం స్పందించి మీ యొక్క సమస్యలను ఎంపిల దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్లో మీ సమస్యపై ప్రస్తావించి మీకు రావలసిన బకాయలను అందించేవిదంగా సహాయపడాలని మీ అందరితరుపున ఎంపిలను కోరి మీకందరికీ న్యాయం చేకూరేవిధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారని సంఘం సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎం.సన్యాసిరావు , సిహెచ్ రామారావు ,బిఆర్ బుగ్గారెడ్డి , అదినారాయణ ,నూకరాజు ,తమ్మారావు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు పుస్తకాలు బాక్స్‌ల పంపిణి



భీమునిపట్నం: తగరపువలస విల్సన్ పేట స్కూల్ లో ముప్పయి ఆరు మంది విద్యార్థులకు టీచర్స్ గ్రూప్ ఆద్వర్యం లో పలకలు పెన్నులు అట్టలు పుస్తకాలు బాక్స్ లు అందజేసారు.

చప్పా అమర్ నాద్ కుమార్తె పూజశ్రీ పుట్టినరోజు సందర్బంగా పంపిణి చేసారు. ఈ సందర్బంగా టీచర్స్ గ్రూప్ కోశాధికారి శ్యామలాంబ మాట్లాడుతూ అమర్ నాద్ ఆలోచన సమాజ మార్పునకు సాంకేతికమని అన్నారు.

ఈ కార్య క్రమానికి టీచర్స్ గ్రూప్ గౌరవ అద్యక్షులు కె.ముత్యాల రావు, ప్రధానోపా ధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చమ్మచింత ఆదర్శ పాఠశాలలో 60 మంది విద్యార్థుల చేరిక

నాతవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం పుణ్యమా అని ఇప్పటి వరకు ప్రైవేటు పాఠశాలల్లో చదివించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. మండలంలో చమ్మచింత ఆదర్శ పాఠశాలలో ఈ ఏడాది 60 మంది విద్యార్థులు చేరినట్లు హెచ్ఎం కాశపు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. అమ్మఒడి పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

# జూనియర్ కళాశాలలు బంద్ విజయవంతం

భీమునిపట్నం: తగరపువలస ఎబివిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలు బంద్ విజయవంతం అయిందని ఎబివిపి జిల్లా కన్వీనర్ ఎల్. అచ్చిబాబు తెలిపారు. ప్రైవేటు జూనియేర్ కళాశాలకు శుక్రవారం సెలవు ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కార్పొరేట్ మాఫియా మీద,ఫీజు దోపిడి మీద ఇస్తున్న ప్రకటనలు విద్యావ్యవస్థలో మార్పునకు నాందిగా ఎబివిపి పరిగణిస్తుందనీ తెలిపారు. ఎబివిపి భాద్యతగా కళాశాలల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలు బంద్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనం పథకం అమలు పరచాలనీ, ఖాళీ గా ఉన్న 3000కు పైగా లెక్చరర్, ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఇన్ ఛార్జ్ ఆర్.ఐ.ఓ వ్యవస్థను తొలగించి వారిని పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ కళాశాలలలో సీట్ల సంఖ్యను పెంచి ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని,అద్దె భవనాలలో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఈ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణి



భీమునిపట్నం: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆదర్శ హింది ప్రేమీమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రదమ ద్వితీయ స్థానాలు వచ్చిన విద్యార్థులకు భీమిలి డివిజన్ టిడిపి అద్యక్షులు మరియు ఆదర్శ హింది ప్రేమీమండలి గౌరవాధ్యక్షులు గంటా.నూకరాజు స్థానిక గ్రంధాలయం సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద విజేతలకు అల్లూరి జీవితచరిత్ర పుస్తకాలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవు తో పాటు దేశ నాయుకుల జీవిత విశేషాలు కూడా తెల్సుకోవాలని అన్నారు.అలాగే విశాఖ జిల్లాకు అల్లూరి పేరు పెడితే సముచితంగా వుంటుందని అంతే కాకుండా పార్లమెంట్ లో ఆయన కాంస్య విగ్రహానికి ఏర్పాటుచేసె విదంగా మన ప్రజా ప్రతినిధులు కృషి చెయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

# మండల ప్రత్యేక అదికారిగా సుబ్రమణ్యం

భీమునిపట్నం: మండల అద్యక్షులు పదవీ కాలం ముగిసిన నేపద్యంలో ప్రభుత్వ ఉత్తర్యుల ప్రకారం మండల ప్రత్యేకాధికారిగా మండల వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చదువుల సుబ్రమణ్యం ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్యులు జరిచేసారని ఎండివో ఎ. లవరాజు తెలిపారు.

# ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నానికి వినతి పత్రం పంపిన పెదిరెడ్ల నానాజీ

ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో సేవలు అందిస్తున్న ప్రముఖ సంఘ సేవకులు పెద్దిరెడ్ల నానాజీ ఈ ప్రాంతంలో పేద ప్రజలకు వైద్య పరంగా ఎటువంటి సమస్యలున్నా నగరంలో ఉన్న కేజీహెచ్ ఆసుపత్రికి తరలించి వారికి మెరుగైన వైద్యం అదే విధంగా కేజీ సూపర్డెంట్ డాక్టర్ అర్జున్ కలిసి వైద్యపరంగా వారికి ఎటువంటి సమస్యలున్నా ఆ సమస్యకు పరిష్కారం అయ్యే విధంగా ఆయన ఎంతో మంది పేద ప్రజలకు ప్రాణాలు కాపాడాలని ఇన్ని సేవలు అందిస్తూ ప్రజలు మన్ననలను పొందుతున్న డాక్టర్ అర్జును వేరే ప్రాంతానికి బదిలీ చేయడం విషయం తెలుసుకున్న పెద్దిరెడ్ల నానాజీ బాధతో ఆంధ్ర ప్రదేశ్ వైద్య శాఖ మంత్రి ఆళ్ల నానికి డాక్టర్ అర్జున్ కేజీహెచ్ ఆసుపత్రిలో ఉంచి ఇంకా ఎంతో మంది ప్రజలకు ఆయన వైద్య సేవలు ఎంతో అవసరమని ఇప్పటివరకు ఆయన ఎంతో మంది పేద ప్రజల ప్రాణాలు కాపాడారని...

మానవత్వ దృక్పదంతో ఆయన బదిలీ కాకుండా ఇక్కడే వుంచి ఎంతో మంది ప్రాణాలు కాపాడుతూ ప్రజలకు సేవ చేయాలని వినతి పత్రంలో విన్నవించుకున్నారు.

# ఆటో యూనియన్ సభ్యులకు హెచ్ఐవిపై అవగాహన



గొలుగొండ : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మీ హెచ్ఐవి స్థితి తెలుసుకోండి అనే కార్యక్రమంలో భాగంగా గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో ఆటో యూనియన్ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్ వైజర్ ఎస్.గోవిందరావు రిస్క్ ఎస్‌స్‌మెంట్ ఫార్మట్ పంచి హెచ్ఐవి టెస్ట్ చేయించుకోవాలని తెలిపారు. సుఖవ్యాధుల గురించి టిబి వ్యాధి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రిషి, యూనియన్ సభ్యులు, క్లస్టర్ లింక్ వర్కర్ బి.జాన్సీ పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న గ్రామ సింహాలు

- మనుషులూ, పశువులనూ వదలని వైనం
- వీధి కుక్కల సమస్య పరిష్కరించాలని కోరుతున్న స్థానికులు



చోడవరం: చోడవరం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులు చేస్తున్నాయి. వీధులలోని కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహనదారఋలపై దాడులకు పాల్పడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్ళి వస్తున్న సమయంలో తమ పిల్లలను ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులతో పాటు, రహదారులపై వెళుతున్న వాహనదారులపైకి వీధి కుక్కలు వెంటపడుతుండటంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మాంసం దుకాణాలు వద్ద వ్యర్థాలను తినడం అలవాటుగా చేసుకున్న వీధి కుక్కలు అవి దొరకని సమయంలో దాడులకు తెగపడుతున్నాయి. అంభేరుపురం, గోవాడ, చాకిపల్లి తదితర గ్రామాలలో కళ్ళాల వద్ద ఎవరూ లేని సమయంలో ఆవు పెయ్యిలపైన దాడులకు తెగబడి హతమారుస్తుండటంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెయ్యిలు మృత్యువాత పడటం వలన ఆవులు సమంగా పాలు ఇవ్వడం లేదని, దీంతో అందివస్తాయనుకున్న పెయ్యిలు నష్టపోవడంతో పాటు, ఆర్థికంగాను నష్టపోతున్నామని ఆయా గ్రామాల పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల ఊరివేత కార్యక్రమం చేపట్టి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

# పోలీస్‌స్టేషన్లలో స్పందన కార్యక్రమం

నర్సీపట్నం : ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్లలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నర్సీపట్నం ఏఎస్పీ ఆరీఫ్‌హఫిజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఎవరైనా ఫిర్యాదులు అంద జేస్తే నిర్దిష్ట సమయంలో పరిష్కారం చూపుతామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదవండి.. చదివించండి
**విజయభాను**

# 7 నుంచి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

విశాఖ సిటీ : జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం, యంగ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి ఎమ్మెల్యే కప్ పేరిట జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని ఇండోర్ ట్రైనింగ్ స్టేడియంలో జరిగే పోటీలకు సంబంధించిన గోడపత్రికను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు పోటీలు జరుగుతాయన్నారు. బాల, బాలికల అండర్-10, -12, -14, -17 విభాగాలతో పాటు మహిళ, పురుషుల విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో లక్కీ షాపింగ్‌మాల్ అధినేత జి.ఎస్.స్వామి, ఒలింపియన్ క్రీడాకారుడు ఎం.వి.మాణిక్యాలు, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డి.నాగేశ్వరరావు, రాష్ట్ర వెయిట్‌లిఫ్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.సూర్యనారాయణ, జిల్లా టేబుల్ టెన్నిస్ కార్యదర్శి, రిఫరీ డి.వి.ఎస్.వై.శర్మ, ఎం.రవికుమార్, మూర్తి, యంగ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సత్తిరాజు, బాబి, దాడి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 1 నుండి ప్లాస్టిక్ కోర్ కమిటీ కార్యక్రమాలు

**ప్రజలలో ప్లాస్టిక్ నిషేధం పట్ల పూర్తి అవగాహన**
**జివియంసి కమిషనర్ డా.జి.సృజన**

విశాఖపట్నం: జివియంసి పరిధిలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చేపట్టవలసిన కార్యక్రమాలను చర్చించి చర్యలు తీసుకోడానికి ప్లాస్టిక్ కోర్ కమిటీ కార్యక్రమాలను ఆగష్టు 1 నుండి పూర్తి స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు.

కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన ప్లాస్టిక్ కోర్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా 2016 ప్లాస్టిక్ మేనేజిమెంట్ రూల్సును పాటించడానికి అనువుగా విధులు నిర్వర్తించవలసి ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం, వాడకం తగ్గించవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు, సభ్యులకు నిబంధనలు, బాధ్యతలు తెలియజెప్పడానికి ప్లాస్టిక్ కోర్ కమిటీ దోహదపడుతుందని తెలిపారు. కమిటీ కాలం 36 నెలలని, సంవత్సరానికి ఎనిమిది సమావేశాలు నిర్వహించవలసి ఉన్నట్లు వెల్లడించారు. సభ్యులుగా చురుకైన స్వచ్ఛంద, స్వచ్ఛత కార్యక్రమాలులో పాల్గొన్న వారిని సభ్యులుగా కమిటీ ఎంపిక చేస్తుంది. దశలవారీగా ప్లాస్టిక్ నిర్మూలనకు కమిటీ చర్చిస్తుందని వెల్లడించారు. సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్ కుమార్ కమిటీ లక్ష్యాలు, ప్రజలలో మార్పు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంల గురించి వివరించారు.

ఏపి పిసిబి ( ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) జివియంసిలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏపిపిసిబి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ పి.వి.వి ప్రసాదరావు, సోహన్ హట్టంగడి, కె.యస్.ఆర్.మూర్తి, అప్పలరెడ్డి పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## రాహుల్ వైరాగ్యం!

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ రాహుల్‌గాంధీ ఉత్తరం రాయడంతో ఇక ఆయన కొనసాగే అవకాశాలు లేవని మరింత స్పష్టమైపోయింది. వారంలోగా వర్కింగ్ కమిటీ సమావేశమై కొత్త నాయకుడిని ఎంపిక చేస్తుందని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నేపథ్యం లో ఆయన పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారే తప్ప పార్టీ నాయకత్వాన్ని ఏదో విధంగా కాపాడుకుంటూనే ఉంటారనేది స్పష్టం. పార్టీ వైఫల్యాలకు తాను బాధ్యుడిగా ఉండకుండానే, నాయకత్వం నెరపాలనేది ఆయన కోరిక. తాను పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించిప్పటి మాటల్లో ఈ వైఖరి స్పష్టమైంది. వర్కింగ్ కమిటీ సమావేశంలో కొందరు పార్టీ నాయకత్వానికి ప్రియాంక పేరు ప్రస్తావించినప్పుడు ఆమెను ఇందులోకి లాగకండి అనే రీతిలో వ్యాఖ్యానించారు. ఆమె ఎక్కువగా మాట్లాడకుండా నిరుత్సాహపరిచారని కూడా వార్తలను బట్టి తెలుస్తున్నది. తమ కుటుంబం వారికి (ప్రియాంకకు) అధ్యక్షపదవి ఇవ్వకూడదని రాహుల్ అంటున్నారు. కానీ తనకు ఆసక్తి లేదని ప్రియాంక ఇప్పటివరకు చెప్పలేదు. కాంగ్రెస్‌లోని అనేకమంది నాయకులను తొలిగించి, తనకు నచ్చిన రీతిలో ప్రక్షాళన కావించాలని, తన మార్గదర్శకత్వంలోనే పార్టీ నడువాలని రాహుల్ కోరుకుంటున్నారనేది ఆయన ఉత్తరాన్ని బట్టి తెలిసిపోతున్నది. పార్టీ పరాజ యం తర్వాత కూడా రాహుల్ ఏ మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. రాజకీయ నాయకులకు ముందుండి పోరాడే లక్షణం ఉండాలె. నెహ్రూ మరణించే నాటికి ఇందిరాగాంధీ పార్టీ అధ్యక్షురాలిగా చురుగ్గా వ్యవహరించారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యత్వం పొంది లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో చేరారు. ఆమె పదవులు స్వయంగా సాధించుకుని, నిలబెట్టుకున్నవే. కానీ రాహుల్‌గాంధీ మొదటి నుం చి అధికారం నెరపాలె కానీ బరువు, బాధ్యతలు ఉండకూడదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆయనకు బాధ్యతలు చేపట్టడం మీద ఆసక్తి ఉం టే మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలోనే చేరేవారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ మొదటి పర్యా యం అధికారం చేపట్టిన తర్వాత, ఒక దశలో రాహుల్‌గాంధీ నాయకత్వంపై నమ్మకం సడలి కార్యకర్తలు అసహనం ప్రదర్శించడం మొదలుపెట్టారు. మొదటినుంచి పార్టీకి విధేయులుగా ఉండే మేధావులు కూడా ఆయన పట్ల అసంతృప్తిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆయన నాయకత్వ వైఫల్యం మరింత స్పష్టమైం ది. దీంతో ఆయన ముందుగానే రాజీనామా చేసి విమర్శల నుంచి తప్పించుకున్నారు. పార్టీకి రాజీనామా చేస్తూ ఆయన రాసిన ఉత్తరాన్ని గమని స్తే, పైకి తాను బాధ్యత వహిస్తున్నట్టు చెప్పుకున్నా, కారణాలను వేరొకరిపైకి తోసే ప్రయత్నమే కనిపిస్తున్నది. బీజేపీ, ఆరెస్సెస్‌తో పాటు మీడి యా, న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ మొదలైనవన్నిటినీ తప్పుబట్టారు. పార్టీలో అనేక మం ది బాధ్యత వహించాలన్నారు. తాను ఒంటరిగా పోరాటం చేశానని చెప్పుకోవడం అంటే పార్టీ తన వెనుక లేదనేది ఆయన ఆరోపణ. బీజేపీ- ఆరెస్సెస్ వ్యవహరించిన తీరు అభ్యంతరకరమైనదే. వ్యవస్థల్లో లోపాలున్న మాట నిజమే. కానీ ఈ పరిస్థితులను ఎదుర్కొనడంలో తన వైఫల్యాలను గుర్తించడం లేదు.

ప్రాంతీయ పార్టీల నాయకులు ఇంత కన్నా విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న సందర్భాలున్నాయి. అయినా నెగ్గుకురావడం వారి నాయకత్వ లక్షణాన్ని సూచిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాహుల్ వ్యవహారసరళి పట్ల ఏ మాత్రం రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారికైనా ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. బీజేపీ ఎంత దుందుడుకుగా వస్తున్నదో తెలుసు కను క, దేశవ్యాప్తంగా రాజకీయపక్షాలను కూడగట్టాల్సింది. ప్రాంతీయ, తటస్థ పార్టీలు ఉన్నచోట వారు ఎన్ని సీట్లు ఇచ్చినా సరే ఆమోదించి, తమశక్తియుక్తులన్నిటినీ బీజేపీపై ప్రయోగించాల్సింది. బీజేపీ తో ముఖాముఖి తలపడిన సీట్లలో ఆ పార్టీని ఓడించడానికి కృషిచేయాల్సింది. కానీ ఆయన తటస్థ పార్టీలతో తలపడటం ద్వారా తన శక్తియుక్తులను బీజేపీపై కేంద్రీకరించలేకపోయారు. దేశ ప్రజల కు సంఘటిత ప్రత్యామ్నాయం చూపడంలో విఫలమయ్యారు. ఎన్నికలముందు తాను ప్రధాని కావాలని తహతహలాడి, తీరా పరాజయం వరించాక తనకు పదవులు ముఖ్యం కాదని అంటున్నారు. రాహుల్‌గాంధీ తన వ్యక్తిత్వంలోనే లోపాలున్నాయి. నాయకుడిగా విఫలమయ్యారనేది స్పష్టం. నెహ్రూ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తన ఆధిపత్యాన్ని వదులుకోదు. పార్టీకి కొత్త అధ్యక్షు డు రావచ్చు కానీ, కొత్త నాయకత్వం రావడం సమీప భవిష్యత్తులో అనూహ్యం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షోభం నుంచి బయటపడటం అంత సులభం కాదు. ప్రాంతీయ పార్టీలను సమా న స్థాయిలో గుర్తించి కలిసి నడిస్తే, దీర్ఘకాలికంగా నిలదొక్కుకోవడం ఎట్లా ఉన్నా, కనీసం కొంత తక్షణ వెసులుబాటయినా లభిస్తుంది.



## ట్రంప్‌తో భేటీకానున్న ఇమ్రాన్‌ఖాన్

వాషింగ్టన్ : పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ జులై నెలలో అమెరికాలో పర్యటించ నున్నారు. అమెరికా ఆహ్వానం మేరకు ఇమ్రాన్‌ఖాన్ ఈ నెల 22న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాషింగ్టన్‌లో సమావేశం కానున్నారు. పాకిస్తాన్ విదేశాంగ అధికారులు ఈ విషయాన్ని ధ ృవీకరించారు. ఇమ్రాన్ పర్యటనతో ఇరుదేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి భేటీపై చైనా, భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. టెర్రరిజంపై పోరాడటానికి అధికారికంగా ఇరుదేశాలు ఒప్పందం చేసుకున్నా కానీ పాకిస్తాన్ తమ నమ్మకాన్ని వొమ్ముచేసిందని, అమెరికా నుంచి కోట్ల రూపాయల నిధులు తీసుకొని దుర్వినియోగం చేస్తోందని ట్రంప్ గత సంవత్సరం పాకిస్తాన్‌పై తీవ్రంగా విరుచుకపడిన విషయం తెలిసిందే.

ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో కూడా ఇరుదేశాలకు బేధాభిప్రాయాలు ఉన్నాయి. తాలిబాన్‌లకు వ్యతిరేకంగా అమెరికా యుద్ధం చేస్తుంటే, పాకిస్తాన్ మాత్రం పరోక్షంగా తాలిబాన్‌లకు సహాయ సహకారాలు అందిస్తోందని అమెరికా నాయకులు తరచూ విమర్శిస్తున్నారు. దీంతో అమెరికా పాకిస్తాన్‌కు అందించే ఆర్థిక సహాయంలో కోత విధించింది. మరోపక్క అమెరికాతో భారత్‌కు పెరుగు తున్న సాన్నిహిత్యం పాకిస్తాన్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ అభ్యర్థన మేరకు మసూద్ అజర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించడంలో అమెరికా తన సంపూర్ణ మద్దతు తెలిపింది. పాకిస్తాన్ కూడా అంతర్జాతీయంగా అమెరికాను చికాకు పెట్టేలా ప్రవర్తిస్తోంది. ఒకపక్క చైనా ఇబ్బడిముబ్బడిగా పాకిస్తాన్‌లో పెట్టుబడులు పెడుతూ, అంతర్జాతీయ వ్యవహారాలలో పాకిస్తాన్‌కు వంతపాడటం, మరోపక్క రష్యాతో పాకిస్తాన్ చేసుకుంటున్న సైనిక ఒప్పందాలు తదితర విషయాలపై ఈ సమావేశంలో ఒక స్పష్టత వస్తుందని అమెరికా భావిస్తోంది. అసలే ఆర్థిక సంక్షోభంలో కూరుకుని దినదిన గండంగా రోజువారిగా వ్యవహారాలు నడుపుతున్న పాకిస్తాన్‌కు ఈ పర్యటన ఎంతో కీలకం కానుందని విశ్లేషకులు అంటున్నారు.

## మొబైల్ ఫోన్స్ మరింత చవక



న్యూఢిల్లీ : మొబైల్ ఫోన్లు వినియోగదారులకు మరింత చేరువ కానున్నాయి. సెల్యులార్ మొబైల్ ఫోన్స్‌లోని కెమెరా మాడ్యూల్, చార్జర్, అడాప్టర్‌లపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. దీంతో మొబైల్ ఫోన్ల ధరలు మరింత తగ్గనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలిసారిగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కస్టమ్ డ్యూటీ తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఇండియాలో స్మార్ట్‌ఫోన్ల మార్గెట్ అనూహ్యరీతిలో పెరుగుతూ వస్తోంది. ఇది 2018లో 14.5 శాతం పెరగగా, 2019లో 15 శాతానికి పెరగనుందని, 2021 నాటికి ఇండియాలో మొబైల్ సబ్‌స్క్రిప్షన్ 1.4 బిలియన్లకు పెరగనుందని అంచనా.

## బడ్జెట్‌పై ప్రధాని మోదీ స్పందన



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ బడ్జెట్ ద్వారా మధ్య తరగతి వర్గానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పన్ను విధానాన్ని సులభతరం చేశా మని, అదే విధంగా మౌలిక వస తుల కల్పనలో సరికొత్త అభివృద్ధిని చూడబోతు న్నామని హర్షం వ్యక్తం చేశారు.

'దేశంలోని ప్రతీ పౌరుడికి మేలు కలిగించే బడ్జెట్ ఇది. దీని ద్వారా పేద లకు మంచి జరుగు తుంది. యువతకు లబ్ధి చేకూరు తుంది' అని వ్యాఖ్యానించారు.

అదే విధంగా వ్యవ సాయ రంగంలో విప్లవాలకు నాంది పలికేలా బడ్జెట్ రూప కల్పన జరిగిందని, నవ భారతా నికి ఇదొక రోడ్ మ్యాప్‌లా ఉపయోగ పడు తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ప్రతి రూపాయిలో 68పైసలు పన్నుల నుంచే..



న్యూఢిల్లీ : సర్కార్ ఖజానాకు చేరే ప్రతి రూపాయిలో 68 పైసలు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచే జమవుతున్నాయి. ఇక ప్రభుత్వ వ్యయంలో సింహభాగం అంటే 23 శాతం పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా కింద ఆయా రాష్ట్రాలకు కేంద్రం చెల్లిస్తోంది. బడ్జెట్ గణాంకాల ప్రకారం ప్రభుత్వానికి సమకూరే ప్రతి రూపాయి రాబడిలో జీఎస్టీ నుంచి వచ్చే ఆదాయం 19 పైసలుగా ఉంది.

ప్రతి రూపాయిలో అత్యధికంగా కార్పొరేషన్ పన్ను వాటా 21 పైసలుగా ఉండటం గమనార్హం. మరోవైపు రుణాలు, ఇతర మార్గాల్లో సమీకరించే రాబడి ప్రతి రూపాయిలో 20 పైసలు కాగా, వసూలయ్యే ప్రతి రూపాయిలో ఆదాయ పన్ను వాటా 16 పైసలుగా ఉంది.

ఇక పెట్టుబడుల ఉపసంహరణ వంటి పన్నేతర రాబడుల నుంచి ప్రతి రూపాయిలో 9 పైసలు సమీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. కాగా ప్రభుత్వానికి సమకూరే ప్రతి రూపాయిలో 8 శాతం ఎక్సైజ్ సుంకం, 4 పైసలు కస్టమ్స్ సుంకం, మూడు పైసలు రుణేతర పెట్టుబడి వసూళ్ల నుంచి ప్రభుత్వం రాబడుతోంది.

## బంగారం పైపైకి..



న్యూఢిల్లీ : బంగారం ధరలు భారం కానున్నాయి. పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహిళా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మగువలకు ఇష్టమైన బంగారంపై పన్నుల భారం మోపారు. బంగారంపై కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలను పెంచారు.బంగారం సహా ఇతర విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు.

బంగారంపై సుంకాల పెంపుతో స్వర్ణాభరణాలు మరింత ప్రియం కానున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరలు పెరగడంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం బలహీన పడటంతో ఇప్పటికే భారమైన బంగారం ధరలు తాజాగా సుంకాల పెంపుతో మరింత పెరగనున్నాయి.

## కవి సమయం

### గగన కుసుమం

సాక్షిగా వస్తాను
ఈ భువనం నుండి గగనానికి
సామాన్యుడి బతుకుని
కన్నీటి నదిలో
కష్టాల నావపై
పయనింప చేస్తున్న
రాజకీయ నాయకుల చరిత్రలను
వివరించడానికి
సాక్షిగా వస్తాను
విద్య వినయములకు
స్వస్తి చెప్పి
తప్పుదోవ పడుతూ
మత్తు గమ్మత్తులకు
చిత్తు చిత్తుగా
బానిసలవుతున్న
యువతీయువకుల
విలాసాలను
విశదీకరించడానికి
సాక్షిగా వస్తాను..

...కవితా రచన
ఆకాశం సత్యప్రకాష్

## పంచాంగం

మాసం : ఆషాఢ; తిథి : చవితి సా.4.41; మఘ రా.2.19; ప.వ.3.07ల 4.36.

శనివారం 06-07 -2019

a **మేషం** : మనోధైర్యం వలన అనుకున్న పనులు పూర్తి చేస్తారు. శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. చేపట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. శ్రీమతి శ్రీవారు ఆరోగ్య విషయంలో ఆందోళన పడతారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు.

b **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసివచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందుతుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. అవివాహితులకు అనుకూలం. కొత్త పరిచయాలు ఏర్పడతాయి.

c **మిథునం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టిసారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి.

e **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మిత్రులలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. స్త్రీలకు చుట్టు ప్రక్కల వారితో సత్సంబంధాలు నెలకొంటాయి. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసుకుంటుంది. వాహన యోగం పొందుతారు.

e **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబం ధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు.

f **కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు.

g **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెలకువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగాలు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది.

h **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. భాగస్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వస్త్రాలు, వస్తువులు అమర్చుకుంటారు.

i **ధనుస్సు** : టెక్నికల్, ఎలక్ట్రానికల్ రంగాలలో బాగా అభివృద్ధి చెందుతారు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. సన్నిహితుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్త్రీలకు విలువైన వస్తువులు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లు సంతృప్తి, పురోభివృద్ధి.

j **మకరం** : మీ ముఖ్యుల కోసం ధనం బాగా వెచ్చించవలసి వస్తుంది. నూతన దంపతులకు ఎడబాటు తప్పదు. ఉద్యోగస్తులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. మీ సంతానం మొండి వైఖరి మిమ్ములను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవతారు.

k **కుంభం** : నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. మీ యత్నాలకు సన్ని హితులు అన్నివిధాలా సహకారం అందిస్తారు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. ప్రయాణాలు, బ్యాంకింగ్ వ్యవహారాల్లో మెలకువ వహిం చండి. విదేశీ యత్నాలు ఫలించగలవు.

L **మీనం** : మీ సంతానం ఉన్నత విద్యావకాశాల గురించి ఆందోళన చెందు తారు. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. బంధు మిత్రుల కలయికతో నూతన ఉత్సాహం కానవస్తుంది. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం.నిర్మాణ పనులలో జాప్యం,

# ఆపదలో ఆదుకునే నారసింహుడు

## సంకీర్తన



నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసమే ఆవిర్భవించాడు కనుక, భక్తులను ఆదుకోవడంలోను .. అనుగ్రహించడంలోను ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడని అంతా విశ్వసిస్తుంటారు. ఆ స్వామి కొలువైన ప్రాచీనమైన క్షేత్రాల్లో ప్రకాశం జిల్లా పరిధిలో గల 'సింగరాయ కొండ' ఒకటిగా కనిపిస్తూ వుంటుంది. ఈ క్షేత్రం మహి మాన్వితమైనదని చెప్పబడే ఎన్నో సంఘటనలు ఇక్కడ కథలు .. కథలుగా వినిపిస్తూ వుంటాయి.పూర్వం ఈ స్వామిని అర్చించే పూజారి, పసివాడైన తన బిడ్డతో సహా ఆలయానికి వెళ్లి, స్వామివారికి నైవేద్యం సమర్పించి వెనుతిరిగాడట. తన బిడ్డను ఆలయంలో మరిచిపోయి వెళ్లిన ఆయనకి, చాలా సేపటి తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. తన మతిమరుపుకు తిట్టుకుంటూ, పరుగు పరుగున ఆలయం దగ్గరికి చేరుకున్నాడు. పిల్లవాడు ఆకలితో ఏడుస్తూ ఉంటాడని అనుకుంటూ, ఆతృతగా తలుపులు తెరిచాడు.

ఆలయంలో ఆడుకుంటోన్న పిల్లవాడిని చూసి ఆనందంతో పొంగిపోయాడు. పిల్లవాడిని అక్కున చేర్చుకుని "ఆకలి వేయలేదా?" అని అడిగితే, నరసింహస్వామి మూర్తిని చూపించి ఆయన తనకి అన్నం తినిపించాడని చెప్పాడట. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా ఉన్నాడని చెప్పడానికి ఇదొక నిదర్శనమని చెబుతుంటారు. ఇక్కడి నారసింహుడు మనసున్నవాడనీ .. మహిమగలవాడనీ .. ఆపదలో ఆదుకునే బంధువని విశ్వసిస్తుంటారు.

**ఈ శకునం శుభసూచకమే !**

ఏదైనా ఒక ముఖ్యమైన పనిమీద ఎక్కడికైనా వెళ్లాలని అనుకున్నప్పుడు, శకునం చూసుకుని బయలుదేరుతూ వుంటారు. కాస్త ఆలస్యమైనా మంచి శకునం చూసుకునే అడుగు బయటికి పెడుతుంటారు. ఇలా మంచి శకునం చూసుకుని బయలుదేరడం వలన, వెళ్లిన పని సఫలీకృతమవుతుందనే విశ్వాసం పూర్వకాలం నుంచీ వుంది. ఎవరికి వాళ్లు తాము తలపెట్టేకార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలనే ఆశిస్తారు. అందుకే శకునానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు.ఈ నేపథ్యంలో కొన్ని శకునాలు మంచివిగా ... మరికొన్ని శకునాలు అందుకు విరుద్ధమైనవిగా చెప్పబడుతున్నాయి. ఇక కార్యసిద్ధిని కలిగించే శకునాలలో పూలు - పండ్లు కనిపిస్తూ వుంటాయి. సాధారణంగా దైవ దర్శనానికి వెళ్లాలని అనుకోగానే ముందుగా గుర్తుకువచ్చేది పూలు .. పండ్లే. భగవంతుడిని పూలతో అలంకరిస్తూ .. అర్చిస్తూ వుంటారు. ఆయనకి వివిధరకాలైన పండ్లను నైవేద్యంగా సమర్పిస్తూ వుంటారు.

ఇక శుభకార్యాలలోను పూలు - పండ్లకి ప్రధానమైన స్థానం ఇవ్వబడుతుంది. ఇవి లేకుండా శుభకార్యమనేది జరగనే జరగదు. దీనినిబట్టి పూలు - పండ్లు ఎంతటి శుభప్రదమైనవో అర్థంచేసుకోవచ్చు. అందువలన పూలబుట్టతో గానీ .. పండ్లబుట్టతో గాని ఎవరైనా ఎదురురావడం శుభసూచకంగా విశ్వసించడం జరుగుతోంది. పూలతోను ... పండ్లతోను కూడిన శకునం మంచిదిగా భావించి వెంటనే బయలుదేరవచ్చని స్పష్టం చేయబడుతోంది.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# ధాన్యలక్ష్మీకి ప్రత్యేక పూజలు



విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవా లయంలో శుక్రవారం ధాన్యలక్ష్మీకి ప్రత్యేక పూజలు గావి ంచారు. దేవాలయం ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యుల ఆధ్వ ర్యంలో వేదమంత్రాల నడుమ ధాన్య లక్ష్మీకి స్నప నము, పంచామృత అభి షేకాలు, అర్చన గావించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 8వతేదీన ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులందరూ చేరాలి

యానాం : శుక్రవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ (గణితం), భౌతికశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన ప్రమోషన్ కౌన్సిలింగ్ మరియు మధ్యాహ్నం 3 గంటల నుండి స్కూల్ అసిస్టెంట్ (సోషల్) సబ్జెక్టులకు ప్రమోషన్ కౌన్సిలింగ్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నందు నిర్వహించబడును. 6వతేదీ ఉదయం మధ్యాహ్నం 2 గంటలకు ప్రాథమిక పాఠశాలల ప్రధానో పాధ్యాయులు (ఎల్ఎఫ్‌యల్‌హెచ్ఎం) జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించబడునని తెలియజేయడమైనది. మరియు 4వతేదీన, 5వతేదీన, 6వతేదీలలో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులందరూ 8వతేదీన జాయిన్ కావలసినదిగా జిల్లా విద్యా శాఖాధికారి వారు తెలియజేయుచున్నారు.

# నేడు బాలయోగి గురుకులాల్లో సీట్లు భర్తీలు

విజయనగరం : ఈనెల 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ బాలయోగి గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్లు 5వ తరగతి నుంచి 9వ తరగతి కొరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని విద్యాశాఖ పేర్కొంది. చీపురుపల్లిలో ఉన్న బాలయోగి గురుకులంలో ఈ భర్తీ ప్రక్రియ నిర్వహిస్తారు. 2018-19 విద్యా సంవత్సరం ఉత్తీర్ణులై ఉండాలని ప్రతిభ ఆధారంగా అలాగే 5వ తరగతి నుంచి 9వ తరగతి వారికి లాటరీ పద్ధతి ద్వారా భర్తీ చేయపడతాయని తెలిపారశ్రీను. ఇంటర్ విద్యార్థులు ధృవపత్రాల జెరాక్స్ కాపీలు తీసుకురావాలి. అలాగే ఎస్ఎస్‌సి మార్క్స్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో రావాలి. పేర్లు ఉదయం నుంచి 12 గంటల్లో నమోదు చేసుకోవాలి.జిల్లాలో నెల్లిమర్లలో సిఇసి 61 సీట్లు ఉన్నాయి.

వాటిలో ఎస్సీలకు 56, ఎస్టీలకు 3, బిసి, ఓసిలకు ఒకొక్కటి కేటాయించారు. వియ్యంపేటలో ఎంఇసి 28 సీట్లుకు 27 ఎస్సీలకు 1 ఎస్టీకి, అలాగే సిఇసి 28 సీట్లు ఎస్సీలకు 27, ఎస్టీలకు 1, వేపాడ ఎంపిసి ఎస్సీలకు 7, ఎస్టీలకు 2,ఎస్సీలకు , ఎస్టీ 1, బిసి,1 27, ఎస్టీలకు 1, బిసి, ల. ఓసి 1, సాలూరు 13 సీట్లు, కొప్పెర్ల 3, పార్వతీపురం 2, బైసిపి 3 ఖాళీలున్నాయి. ఐదు నుంచి 9వ తరగతి వరకు 109 సీట్లు ఎస్సీలకు, 8 ఎస్టీలకు,బిసిలకు 10, మొత్తం 130 సీట్లు ఉన్నాయి. 6వ తరగతి 43, 7వ తరగతి37, 8వతరగతి 22, 9వ తరగతి 17 ఖాళీలున్నాయి.

# రేపు 'మా ఇంటిలో మహాశివుడు' నాటిక



అనకాపల్లి : పట్టణంలో గౌరీ సంఘం మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మా ఇండిలో మహాశివుడు అనే నాటికి లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు మళ్ల సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల జరిగే వినోద వల్లరి కార్యక్రమంలో భాగంగా చిలకలూరి పేట సిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నాటిక ప్రదర్శించడం జరుగుతుంద న్నారు. అనంతరం పలు స్కిట్స్ ప్రదర్శిం చడం జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధిగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్ వైసీపీ నాయకులు భీశెట్టి జగన్ హాజరవుతారని చెప్పారు. హాస్యాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఈసందర్భంగా సురేంద్ర కోరారు.

## అర్హులకు న్యాయం చేసేందుకే ఇంటి సర్వే

**అసిస్టెంట్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి**



విజయనగరం : విజయ నగరం కార్పొరేషన్ పరిధిలో అర్హు లందరికీ న్యాయం చేసేందుకే ఇంటి సర్వేను నిర్వహిస్తు న్నామని అసిస్టెంట్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి అన్నారు. ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. శుక్రవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఇంటి సర్వేపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల వ్యవధిలో ఇంటి సర్వేను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ వార్డుకు ఇద్దరిని సర్వే నిమిత్తం నియమించామన్నారు. అర్హులకు ప్రభుత్వం, ఇళ్లు, స్థలాలు ఇచ్చేందుకు సర్వే కొలమానంగా ఉపయోగపడు తుందన్నారు. సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జెరాక్స్‌లను సేకరించాలని సూచించారు. ముఖ్యంగా ఒకే ఇంటిలో ఉంటూ వేర్వేరు రేషన్‌కార్డులు కలిగివుండి, 21 ఏళ్లు దాటిన ప్రతీఒక్కరూ (పెళ్లైనవారు) ఇంటికి అర్హులన్నారు. ఒకే రేషన్‌కార్డులో వివాహమై 21 సంవత్సరాలు నిండివున్నా, ఎంతమంది ఉన్నా, అందరూ అర్హులని అన్నారు. అలాగే అద్దె ఇళ్లల్లో ఉండేవారు ఇల్లు మంజూరుకు అర్హులవుతారు కాబట్టి వారిని గుర్తించాలని, రేషన్‌కార్డుల ఆధారంగా సమాచారం సేకరించాలని సూచించారు. లబ్ధిదారుని వివరాలు కేవలం మహిళల పేరునే సేకరించాలని, వివాహమై తల్లిదండ్రుల వద్ద వున్న మహిళలను కూడా గుర్తించాలని వారు కూడా ఇళ్లకు అర్హులేనని అన్నారు. ఫోన్ నెంబరు విధిగా సేకరించాలని, ఈనెంబర్ మార్పు చేయరాదని సూచించారు. ఒంటరైన 60 ఏళ్లుదాటిన మహిళలు ఉంటే వారు ఇళ్ల మంజూరుకు అనర్హులన్నారు. అలాగే ఇదే జిల్లాల్లో స్థిరనివాసం ఉంటూ వేరే జిల్లాల్లో ఉద్యో గాలు చేసుకుంటున్నవారి వివరాలు కూడా సేకరించవలసి ఉంటుందని సిబ్బందికి కనకమహాలక్ష్మి సూచించారు.

## ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

**'స్పందన' జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ**

విశాఖపట్నం : విశాఖజిల్లాలో బాధితులు జిల్లా పోలీసులకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర డిజిసి గౌతమ్ సవాంగ్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు జిల్లాలోని ఎస్ఐ నుండి ఎస్పీ వరకు అధికారులు అందుబాటులో వుంటూ వారి కార్యాలయాలలో ఫిర్యాదుదారుల అర్జీలు స్వీకరిస్తారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ 'స్పందన' కార్యక్రమం నిర్వహించబడుతుంది.

# నాతవరంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

నాతవరం : నాతవరంలో శుక్రవారం బిజెపి మండల అధ్యక్షులు కరక నరసింహమూర్తి ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ బిజెపి సభ్యత్వ నమోదుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అశేష ప్రజా ధారణతో కేంద్రంలో రెండో సారి తిరుగులేని శక్తిగా అవతరించిన భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సైనికుల్లా కదలాలని. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పేరూరి బుల్లిదొర, లగుడు మల్లునాయుడు, సీనియర్ కార్యకర్త ఏడిద శ్రీరామచంద్రమూర్తి(పాలకొల్లు), ఒబిసి మోర్చ మండల అధ్యక్షులు చుక్కల రాంబాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు కరక నరసింహమూర్తి**

# బెల్ట్ తీసేదెవరు... వసూళ్ల మత్తులో ఆబ్కారీ శాఖ అధికారులు

అనంతగిరి : ప్రభుత్వం మద్యం షాపులకు మూడు నెలలు కొనసాగిస్తే అందుకు యజమానులు బెల్టు షాపులను పెంచు కుంటూ పోతున్నారు ఒకప్రక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బెల్ట్ షాపులులేకుండా చేస్తామని అంటుంటే వాస్తవానికి ప్రభుత్వ అధికారులు దానికి విరుద్ధంగా చేస్తున్నారు. కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో లైసెన్స్ షాపు ఉన్నది అక్కడినుంచి మండలం మొత్తం మీద మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి మండల కేంద్రంలోని వీధి వీధికి ఒక బెల్ట్ షాపు దర్శనమిస్తున్నాయి ఎక్సైజ్ శాఖ అధికారులు గాని స్థానిక పోలీసు శాఖ గాని వాళ్లపైకి కన్నెత్తి చూడట్లేదు ప్రతి మద్యం సీసాపై అధిక ధరలు విక్రయిస్తుండటం తో తప్పనిసరి పరిస్థితిలో కొనుక్కొని తీసుకుంటున్నారు ప్రతి మద్యం సీసాపై అధికముగా 50 రూపాయలు వసూలు చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రము నెలవారి మామూల్లు వసూలు తీసు కొంటున్నారని అందుకే ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వెనక అడుగు వేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు కొత్తవలస గ్రామానికి ఒక బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని అతని బంధువులు పోలీసు ఉన్నతాధికారి కావడంతో ఆతని మీద చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు బెల్ట్ షాపు లు లేవని ప్రభుత్వంనకు తెలిపారని అవి కాకి లెక్కలు మాత్రమేనని, ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు అధికారులు అందజేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మండలంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా ఎక్సైజ్ శాఖ కమిషనర్ కు ఆన్లైన్ లో ఫిర్యాదు చేస్తామని కొత్త గ్రామస్తులు అనంతగిరి గ్రామ మహిళలు తెలుపుతున్నారు.

# వ్యక్తిగత కక్షలు మానండి -అభివృద్ధిపై దృష్టి సారించండి

**బండారు అప్పలనాయుడు**



సబ్బవరం : వ్యక్తిగత కక్షలు మాని అభివృద్ధిపై దృష్టి సారించండని పెందుర్తి టిడిపి ఇన్‌ఛార్జ్ బండారు అప్పలనాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోఉన్న టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెందుర్తి టిడిపి ఇన్‌ఛార్జ్ బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలపై వ్యక్తిగత కక్షలు మాని అభివృద్ధిపై దృష్టిసారించడని అన్నారు.సబ్బవరంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిపై డిగ్రీ, కాలేజీపై డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించి అభివృద్ధి చేయండని వైసిపి నాయకులకు సూచించారు. టిడిపి కార్యకర్తలపై వ్యక్తిగత కక్షలు మానండి అన్నారు. టిడిపి కార్యకర్త పల్లా తాతారావు గోపాల్‌నగర్‌లో జిరాయితీ సర్వేనెంబరు 199లో సొంత భూమిలో తాగునీటి అవసరం కొరకు బోరును తీసారు. అది కిట్టనివారు ఆ బోరు అధికార్లుకు చెప్పి బోరును ఆపి వేయించారు. ఇది మంచి పద్ధతి కాదని బండారు అప్పలనాయుడు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మిడతాడ మహలక్ష్మినాయుడు, గండి దేముడు, శరగడం శంకర్రావు, కొటానఅప్పారావు, కరణం రామునాయుడు, బి సాయినాధరావు, ఎమ్ అక్కుబాబు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి



అనకాపల్లి : స్వామి వివేకానందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్వామి వివేకానంద సూక్తులను తెలియజేసే పుస్తకాలను పంపిణీ చేసారు. తోటి విద్యార్థులకు సాయం చేయాలన్నారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు.

సరైన మార్గంలో నడవాలని సూచించారు. చదువుకోవడం వలన భవి ష్యత్ బంగారు బాటలో నడుస్తుందన్నారు. తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా అధ్యాపకులు కృష్ణమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ప్రసాద్, నాగమణి తదితరలు పాల్గొన్నారు.

## కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డా.కందుల నాగరాజు వైఎస్సార్ పార్టీలో చేరిక



విశాఖపట్నం : కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డా.కందుల నాగరాజు శుక్రవారం వైఎస్సార్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సీనియర్ వైఎస్సార్ పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాసు కండువ కప్పి పార్టీలో ఆహ్వానించారు. గత అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్‌పార్టీలో వుంటూ తన కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఒక సామాజిక వర్గానికి చెందిన నాగరాజు పార్టీలో చేరడం, పార్టీ ఇంకా ఎక్కువ బలం అని ద్రోణంరాజు అన్నారు. విజయసాయిరెడ్డి ఫోన్లో అభినందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వైఎస్సార్ జగన్ సీఎం అయిన తరువాత పేదవారికి చేసే సేవలు వారి రాజనీతి నచ్చి పార్టీలో చేరారు. అలాగే ఈ సందర్భంగా ద్రోణంరాజు, విజయసాయిరెడ్డి, వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమరంలో కందుల నాగరాజుతో కొండా రాజీవ్ సత్యనారాయణ మొదలగువారు విచ్చేశారు.

# బీజేపీ సభ్యత్వ నమోదుపై నాయకుల సమీక్ష



ములగాడ: జీవీఎంసీ 47 వార్డు పరిధిలో గాజువాక డిపో వద్ద బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ పాలిమేర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి పాలిమేర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ ఆదేశాల మేరకు దేశం మొత్తం సభ్యత్వం నమోదు కార్యక్రమం రేపటినుంచి వార్డులో ప్రారంభిస్తున్నామని అదేవిధంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని మరింత పటిష్టం చేసి పార్టీ గెలుపుకు చేయవలసిందిగా కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు ఈ దిశలోనే విశాఖపట్నంలో ప్రతి నియోజకవర్గంలో బీజేపీని బలపరిచేలా కార్యకర్తలు నాయకులు ముందుకు వస్తున్నారని ఈ తరుణంలోనే పార్టీని మరింత ముందుకు నడిపించేందుకు పార్టీ అధిష్టానం కూడా సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కే.గురుమూర్తి కామేష్ హరిత బి డి రాములు దేవముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T, AT : VISAKHAPATNAM

M.O.P.901/2018

Between :
1. Manjeti Estheru
2. Manjeti Sudha Madhuri
3. Manjeti Manga
(2nd petitioner is being minor rep. by her mother next friend and natural guardian i.e 1st petitioner) ...Petitioners
And
1. Bansode Anil
2. Raut Balu Yeddappa
3. The New India Assurance Company Limited, Rep. by its regional Manager …Respondents

NOTICE

To, Respondents :
R-1: Bansode Anil, S/o.Sivaji, Hindu, aged about 29 years, R/at. Jawli Village and post Kilari P.S Limits, Latur District, Maharashtra State.
R-2: Raut Balu Yeddappa, S/o.Not Known, Hindu, aged about 50 years, A/P Mulegaon Tanda, Swami Vivekanand Nagar TQ, South Solapur, Maharashtra State.

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **18-07-2019** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on**18-07-2019 at 10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

**B. RAMA GOPALA RAJU, CH. GEETHA, Advocates**
Narsipatnam,
Visakhapatnam Dist
Cell: 9494189512



**27వవార్డులలో ఉన్న ఆర్‌బిఎం అప్ స్కూలులో ఉన్న విద్యార్థులకు సుమారు 443 మందికి నోట్సు పుస్తకాలు, 158 స్కూల్ బ్యాగ్స్‌ని విశాఖపట్నం పోర్టు ట్రస్టు యాజమాన్యం సహాయంతో ఈ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ప్రభాకర్, పోర్టు యాజ మాన్యం తరపున కనకరాజు, ప్రసాద్, వార్డు మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్, పండరీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.**

## జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

విజయనగరం: జిల్లాలో అన్ని మండలాలకు అధికారులే ప్రత్యేక అధికారులుగా నియమించినందున ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ బాధ్యతలు స్వీకరించారు.

# రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలపై వైఎస్ఆర్‌సీపీ నాయకులు సమీక్ష



ములగాడ : దివంగత నేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఈనెల ఎనిమిదో తేదీన జరుపుటకు 49 పరిధిలోగల మల్కాపురం రెడ్డి వీధిలో వార్డు అధ్యక్షులు పిలక రామ్మోహన్ రెడ్డి నివాసం నందు శుక్రవారం సాయంత్రం వైఎస్ఆర్ సిపి నాయకులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐదు వార్డుల ఇంచార్జ్

కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి ఈనెల ఎనిమిదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా జన్మదిన వేడుకలు జరుగుతాయని దీనిలో భాగంగానే అదే రోజు నక్కవానిపాలెం ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఈ వేడుకలు అట్టహాసంగా జరుగు తాయని ఈ వేడుకలకు మంత్రివర్యులు అవంతి శ్రీనివాసరావు హాజరవుతారని ఈ కార్యక్రమంలోనే నవరత్నాలులో భాగంగా పెంచిన పెన్షన్ లో అమ్మ ఒడి పలు కార్యక్రమాలను శ్రీకారం చుడతారని అదేవిధంగా ప్రతి శనివారం ఆదివారం శ్రీహరిపురంలో గల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయము నందు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసన సభ సభ్యులు మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బల్ల లక్ష్మణరావు పిలా అనంత్ కొల్లి నూక రెడ్డి బుష అప్పలరెడ్డి మటూరి చిన్నారావు శంకర్ రెడ్డి నూనెల వెంకటరమణ పిట్టా ప్రసాద్ పిలక మహేష్ రెడ్డి అధిక శాతంలో వై ఎస్ ఆర్ సి పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కెడిపిఎం స్కూల్లో స్వచ్ఛభారత్ పై తోలుబొమ్మల ప్రదర్శన

### విద్యార్థులకు అవగాహన పెంపు



విశాఖ సిటీః హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్న వాల్తేర్ లో ఉన్న కే డి పి ఎం జీవీఎంసీ హై స్కూల్లో తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన పవన్ కుమార్ తోలుబొమ్మలాట బృందంతో ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ ప్రదర్శనలో కళాకారులు పాఠశాల పరిశుభ్రత టాయిలెట్స్ పరిశుభ్రత ,ఆహారం తినేటప్పుడు హ్యాండ్ వాష్ అవసరం, అదేవిధంగా ఇంటి వద్ద కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసారు. దీంతోపాటు ఎదిగే బాలలు పౌష్టిక ఆహారం తీసు కోవడం దాని యొక్క ప్రాముఖ్యత తెలియజేశారు. బృందం కి అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శ్రీనివాస రావు, శివ నాయకత్వం వహించారు. స్కూలు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీమతి తిరుమల శ్రీ దేవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు పెంపొందించుకుంటే అనారోగ్యం పాలు కాకుండా ఉండవచ్చు. స్కూలు కూడా పరిశుభ్రంగా ఉంచడం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపుని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీచర్లు జాన్, సత్యవతి, ప్రసాదు, శ్రీను ధాన్ పౌండేషన్ సిబ్బంది టీ జ్యోతి, సంధ్య పాల్గొన్నారు.

## అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా త్రినాధరావు?



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా వేంద్ర.త్రినాధ్ రావు నియామకం దాదాపుగా ఖరారైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.గతంలో ఈయన అన్నవరం దేవస్థానం ఈవోగా మూడు నెలల పాటు విధులు నిర్వహించారు. అయితే గత ఎలక్షన్ లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రస్తుత ఈవో ఎంవి.సురేష్ బాబు కి భాద్యతలు అప్పగించారు.ఈయనకు ఉప ముఖ్యమంత్రి పిల్లి.సుభాష్ చంద్రబోస్ అండదండలు పుష్కలముగా ఉండడంతో తిరిగి అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఈయనకు భాద్యతలు అప్పగిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## తొండంగి ఎస్ఐగా సిహెచ్.గోపాలకృష్ణ



అన్నవరం: తూ.గో.జిల్లా తొండంగి మండలం తొండంగి ఎస్సైగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బదలీ కావడంతో ఆయన స్థానంలో సిహెచ్.గోపాలకృష్ణ ను తొండంగి ఎస్సైగా నియమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నయిమ్ అస్మీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశార.

## ఉత్తరాంధ్రకు మొండిచేయి

విశాఖపట్నం: మోడీ 2 ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిబడ్జెట్ 2019-20 ఉత్తరాంద్రకు తీవ్ర అన్యాయం చేసింది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎటువంటి కేటాయింపులు చేయలేదు. ఉత్తరాంధ్రలో నెలకొల్పిన కేంద్ర విద్యాసంస్థలకు నిధులు తగిన విధంగా కేటాయించలేదు. విశాఖ మెట్రో రైల్‌కు నిధులు లేవు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ప్రకటించలేదు. పైపెచ్చు ప్రభుత్వరంగ సంస్థల షేర్లను లక్ష ఐదువేల కోట్లుకు తెగనమ్మాలని బడ్జెట్‌లో పేర్కొనడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. పెట్టుబడిదారులకు అనుగుణంగా కార్మిక చట్టాలను మార్చాలని ప్రతిపాదించడం ప్రజలకు ద్రోహం చేయడమే. ఈ చర్య విశాఖ జిల్లాలోని 10లక్షల మంది కార్మికులపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది.

## అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలి

### ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 సూపర్ వైజర్ మానసా



కంచరపాలెం: అంగన్వాడీ కేంద్రాలలో విదులు నిర్వహిస్తున్న వర్కర్స్ , హెల్పర్స్ సమయపాలన పాటించాలని ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 సూపర్ వైజర్ మానసా పెర్కొన్నారు. ఈమేరకు జీవీఎంసీ 35 వ వార్డు పరిది సంజీవయ్య కోలని -2 ను శుక్రవారం ఉదయం ఆమే సంధర్శించారు. కేంద్రంలో పౌష్ఠిక ఆహార పట్టికను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి సంబందిత వర్కర్ సమయానికి రావడం లేదని స్థానికుల పిర్యాదు మేరకు కేంధ్రాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ఈమేరకు వర్కర్ సుగుణ కు మెమో జారీచేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రవర్తిస్తే చర్యలు తప్పవని మందలించారు. అనంతరం గర్బిణి , బాలింతలకు పౌష్టిక ఆహారం శక్రమంగా అందుతుందా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు.ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలను యడవల్లి. వెంకటేశ్వరరావు, పెండ్యాల. లక్ష్మీనారాయణ, కొంపెల్ల. మూర్తి, కూచిభట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో ఎంవి.సురేష్ బాబు, ఏసి ఈరంకి. జగన్నాధరావు,సూపరింటెండెంట్ సతీష్, గొల్లు.సత్యనారాయణ,ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేసారు.

## జ్యూట్ కార్మికులకు న్యాయం చేస్తా

### మంత్రి అవంతి శ్రీనివాస్



భీమునిపట్నం: చిట్టి వలస జ్యూట్ మిల్ సమస్యపై కార్మిక సంఘాలు నాయకులు తో మంత్రి వర్యులు అవంతి శ్రీనివాస్ సర్క్యూట్ హౌస్ లో చర్చలు జరిపారు...కార్మికులకు నష్టపరిహారం ఇప్పించే విషయంలో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు..ఈ నెల 9.వ తేదీన సర్క్యూట్ హౌస్ లోనే చర్చలు జరుపుతామన్నారు.ఆ చర్చలకు లెబర్ మినిస్టర్ జయరాం యజమాని హాజరు అవుతారని చెప్పారు..ఈ కార్యక్రమంలో జే సి 2. వేంకటేశ్వర రావు ,జెసిఎల్ వెంకటరత్నం , డీ సి ఎల్ ,లక్ష్మి నరసయ్య , కార్మిక సంఘాలు నాయకులు కే. వరహాల రాజు, జీరు వెంకటరెడ్డి,చిల్ల వెంకటరమణ, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, అల్లు బాబురావు, పడల రమణ,సి.హెచ్.నర్సింగరావు, మద్దిల దేవుళ్ళు, నరవ రామారావు తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## కొబ్బరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : వేటుకూరి



కాకినాడ : కొబ్బరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింఘ్ తోమర్ ఆయన నివాసంలోకిసాన్ మోర్చా అధ్యక్షుడు వేటుకూరి సూర్య నారాయణరాజుకోరారు. కొబ్బరి పంటకు గిట్టుబాటు రావడం లేదని, కోనసీమ ప్రాంతంలో రైతులు, కొబ్బరిపైనే అధారపడి జీవిస్తున్నారని మద్యలో దళారులు వారి పంటకు గిట్టుబాటు ధర చెల్లింపులు చేయడం లేదని కొబ్బరి రైతులు పడుతున్న కష్టాలను మంత్రివర్యులు వివరించడం. కొబ్బరి కొనుగోలు నాఫేడ్ ద్వారా జరపాలాని, నాఫేడ్ కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించాలని భాజాపా కిసాన్ మోర్చా రాష్ట్ర అద్యక్షులు వేటుకూరి సూర్యనారాయణరాజు కోరడం జరిగింది. దానికి ఆయన స్పందించి నాఫేడ్ ఎండి వెంటనే అదేశాలు ఇవ్వడం జరిగింధి. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర 1మార్కెటింగ్ సేసు విషయం పేండింగ్‌లో ఉందని ఆయన అన్నారు. వరి ఇతర పంటలపై ఎంఎస్‌పి పెంచినందుకు మంత్రికి రైతుల తరుపున కిసాన్ మోర్చా ధన్యవాదలు తెలిపారు.

## గ్రామాలలో కేన్సర్ పరీక్షా అవగాహనా శిభిరాలు : డా. సతీష్

కాకినాడ : రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సిల్వర్‌జూబ్లీ అధ్యక్షులుగా ప్రముఖ దంతవైద్యులు డా. వి.ఎన్.వి. సతీష్ కార్యదర్శిగా ప్రముఖ ఫైనాన్సర్ బి. అజయ్ రెడ్డి, కోశాధికారిగా ఎమ్. మాచారెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సూర్యకళామందిరంలో జరిగిన నూతన కార్యవర్గ ప్రతిష్ఠాపనోత్సవానికి ఇన్టలేషన్ ఆఫీసర్‌గా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎమ్. వీరభద్రారెడ్డి (బాబి) పాల్గొని సభ్యులచే పదవీ బాధ్యతల ప్రమాణస్వీకారం చేయించారు. గతంలో ఎన్నడూలేనివిధంగా నూతన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బాబి శ్రీకారం చుట్టారు అధ్యక్షులు సతీష్, కార్యదర్శి అజయ్ రెడ్డిలచే చట్ట సభలలో ఏవిధంగా ప్రమాణ స్వీకారం చేస్తారో అదేవిధంగా వారి వారి పేర్లు చదివి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ప్రకటించడం సభలో కరతళాధ్వనులతో అందరూ అభినందనలు తెలియజేసారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. ఎస్.వి.ఎస్.రావు, అసిస్టెంట్ గవర్నర్ డా. టి.వి. బాలకృష్ణ ప్రత్యేక అతిధులుగా పాల్గొనగా ఆదిత్యా విద్యాసంస్థల చైర్మన్ శ్రీ నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డా. సతీష్ మాట్లాడుతూ 1995లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఏర్పాటుకు శ్రీ ఆంజనేయమూర్తి, దురిశెట్టి శేషఅప్పారావు, బూల్‌చంద్, డా. జాన్‌వర్గీస్ ల ప్రోత్సాహంతో ఆవిర్భవించిన ఈ క్లబ్ గత 24 సం॥లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమేకాక శాశ్వత సేవా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తిచేసిందని అవి రోటరీ బ్లడ్‌బ్యాంక్, రోటరీ డయాలసిస్ సెంటర్, రోటరీ వృద్ధాశ్రమం, రోటరీ కాంపొనెంట్ సెంటర్, రోటరీ హాస్పటల్ వంటి ప్రాజెక్టులద్వారా ప్రజలకు నిత్యము సేవలు అందిస్తోందని వివరించారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా తామ బాధ్యతలు చేపట్టడం జరిగిందని ఈ సం॥ క్లబ్ గౌరవాన్ని పెంచేవిధంగా పలు సేవాకార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధంచేసామన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీకి చెందిన క్యాన్సర్ డిటెక్షన్ వ్యాన్ సహకారంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక శిభిరాలు నిర్వహించి క్యాన్సర్ అవగాహనా కార్యక్రమంతోపాటు ప్రాధమిక దశలోనే క్యాన్సర్ గుర్తించడంద్వారా గ్రామీణులను కాపాడగలమన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కాకినాడలో ఉన్న రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు శ్రీ ఆంజనేయమూర్తి, శ్రీ ఎల్ సత్యన్నారాయణ (టిక్కు), డా. ఎస్.వి.ఎస్. రావు సూచనలు సలహాలతో క్లబ్ మరింత సేవా ప్రగతి సాధించడానికి కృషిచేస్తామన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీని స్పాన్సర్‌చేసిందని వారి ఆలోచన విధంగానే సమాజ అవసరాలను గుర్తించి సకాలంలో సేవలు అందిచగలమని వారి నమ్మకాన్ని మరింతగా పెంచుతామన్నారు. కాకినాడలోనే ప్రస్తుత రోటరీ గవర్నర్ శ్రీ ఎమ్. వీరభద్రారెడ్డి రోటరీ గవర్నర్ కేంద్రకార్యాలయం ఉండడం వల్ల క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింతగా వీక్షిస్తారని వారి సూచనలు ఆశయాలకు అనుగుణంగా క్లబ్ కార్యక్రమాలు చేపట్టి డిస్ట్రిక్ట్‌కే మార్గదర్శకంగా నిలపాలన్నదే తమ అభిమతమన్నారు.

## అడ్డంకులు తొలగించుకోండి రక్తప్రవాహాన్ని సరిచూసుకోండి

### ఇండస్ హాస్పిటల్ యాజమాన్యం



విశాఖపట్నంః రక్తప్రవాహంలో అడ్డు లేకుండా సజావుగా వేగంగా ప్రవహించే విధానాన్ని గమనించాలని, అడ్డుతొలగించుకు నేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు ఇండస్ ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది. శుక్రవారం నగరంలో ఇండస్ ఆసుపత్రిలో ప్రజలకు సరియైన అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న మరణాలలో ప్రతి నలుగురిలో ఒకరు రక్తనాళాల్లో రక్తప్రసరణ లేకపోవడం, రక్తనాళాలు ముడుచుకుపోవడం వలన చనిపోతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో చాలామందికి అవగాహన లేకపోవడం వలన, ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన ప్రాణాపాయ పరిస్థితి కొనితెచ్చుకుంటున్నారని, మరికొన్ని సందర్భాలలో అవసరమైతే అవయవముల తొలగింపు కూడా జరుగుతోందని, ఇది చాలా విచారకరమైన విషయమన్నారు. ఇది ముందుగానే గ్రహించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలనే ఆకాక్షంతో ఇండస్ ఆసుపత్రి, విశాఖపట్నం వారు రక్తనాళాలు మరియు అంతర్ రక్తనాళికల శస్త్ర చికిత్స విభాగం వారిచే సుమారు 15 రోజుల పాటు అవగాహన కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మరిన్ని వివరాలకు డాక్టర్ జాన్సెన్స్ మొబైల్ నెంబరు 7997592222కు సంప్రదించగలరు.



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి సుబ్బారెడ్డిని విశాఖపట్నం నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత అభిమాన నాయకులు వై.వి సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. మేయర్ పీఠం లో వైసీపీ పాగా వేయాలని ,విశాఖపట్నం లో పార్టీ బలోపేతం చేయాలని వంశీకృష్ణకు వై.వి సుబ్బారెడ్డి సూచించారు.

## జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ కల్పించండి

### కలెక్టర్ వినయ్ చంద్‌కు విజెఎఫ్ కార్యవర్గం వినతి

### సానుకూలంగా స్పందించిన కలెక్టర్



విశాఖపట్నం: జిల్లాలో అక్రిడేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు స్కూలు ఫీజులో 100% రాయితీ కల్పించాలని జిల్లా కల్టెర్ వినయ్ చంద్‌ను వైజాగ్ జర్నలిస్టుల ఫోరం కార్యవర్గం కోరింది. శుక్రవారం ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలెక్టర్ వినయ్‌చంద్‌ను కలిసి ఇందుకు సంబంధించిన వినతి పత్రమును అందజేసారు. ప్రస్తుతం విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50% మాత్రమే రాయితీ కల్పిస్తున్నారని అయితే రాష్ట్రంలో గుంటూరు, కడప, కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా 100% ఫీజు రాయితీ అమలు చేస్తు సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని కలెక్టర్‌కు శ్రీనుబాబు వివరించారు. దీనితోపాటు గత 5 సంవత్సరాలుగా ఫీజు రాయితీ కల్పిస్తు జిల్లా ఆధికార యంత్రాంగం జారీచేసిన ఉత్తర్వులును, ఇతర ప్రాంతాలలో 100% ఫీజు రాయితీ కల్పిస్తు తాజాగా జారీ చేసిన ఉత్తర్వులును కలెక్టరుకు వినతి పత్రంతో పాటు అందజేసారు. దీనితో కలెక్టర్ విజయ్‌చంద్ సానుకూలంగా స్పందించారు. తక్షణమే 100% ఫీజు రాయితీ కల్పిస్తు అవసరమైన ఉత్తర్వులు జారీచేస్తామని హామి ఇచ్చారు. అనంతరం విజెఎఫ్ కార్యదర్శి ఎస్. దుర్గారావు, జర్నలిస్టుల ఫోరం సభ్యుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్‌కు తెలియజేసారు. తదుపరి కార్యవర్గ సభ్యులంతా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజుపట్నాయక్, టి.నానాజీ, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, కోశాధికారి పి.ఎన్.మూర్తి, కార్యవర్గ సభ్యులు ఎమ్.ఎస్.ఆర్. ప్రసాద్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శుభ్రత పాటిద్దాం ఆరోగ్యంగా ఉందాం హెచ్పిసిఎల్ అధికారులు పిలుపు



ములగాడ: నగరపాలక సంస్థ మరియు హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థ కలిపి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా హెచ్పిసిఎల్ సంస్థలో శుక్రవారం హెచ్పిసిఎల్ అధికారులు తమ తోటి ఉద్యోగులతో స్వచ్ఛభారత్ పై ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సి జి ఎమ్ హెచ్ ఆర్ రతన్ రాజు పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదేవిధంగా తమ ఇంటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకొని రోగాలకు దూరంగా ఉండాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని అన్నారు అనంతరం హెచ్ ఆర్ మేనేజర్ యు శర్మ స్వచ్ఛభారత్ ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రత పాటిద్దాం ఆరోగ్యంగా ఉందాం అంటూ తోటి ఉద్యోగులతో పలికించి స్వచ్ఛభారత్ పై పలు అంశాలను మాట్లాడారు అనంతరం రామకృష్ణాపురం యరాడ పార్క్ లో స్వచ్ఛ భారత్ లో భాగంగా సుమారు 100 మందితో పేరుకుపోయిన చెత్త లను శుభ్రం చేసి కాలనీవాసులకు స్వచ్ఛభారత్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు రామచంద్రన్ కె రాజారావు రామకృష్ణన్ కాళీ తదితరులు పాల్గొన్నారు

# అంటు వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు

## దోమల వ్యాప్తిని అరికట్టడానికి బృందాలు ఇంటింటికి తిరగాలి

## అనుమానిత డెంగీ కేసులను నిర్ధారణకు కెజిహెచ్‌కు పంపాలి

## జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖపట్నం: వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున వాటి నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు పర్చాలని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జివిఎంసి కమీషనర్ జి.సృజన, వైద్య, ఆరోగ్య శాఖ, జివిఎంసి వైద్యాధికారులతో ఆయన సమావేశమై సీజనల్ వ్యాధుల నియంత్రపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తిరుపతిరావు, సిఎంఓ డా.హేమంత్, జిల్లా మలేరియా నియంత్రణాధికారి మణి, కేజిహెచ్ సూపరిటెండెంట్ డా. అర్జున్, జోనల్ కమీషనర్లు, యుసిడిఎపిడిలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ పూర్తయితే ఉద్యోగం వచ్చే పరిస్థితి ఉండాలి

## అధికారులతో సీఎం జగన్



అమరావతి: ప్రభుత్వ బడులను బాగుచేయడాన్ని సవాల్‌గా తీసుకున్నామని.. ఏ దశలోనూ డ్రాపౌట్స్ ఉండకూడదని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ నిపుణుల కమిటీతో సీఎం సమావేశమయ్యారు. విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌తో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యాశాఖలో అమలు చేయాలనుకుంటున్న నూతన విధానాలపై సీఎం వారితో చర్చించారు. విద్యారంగంలో మార్పులపై కమిటీకి తన అభిప్రాయాలు చెప్పారు. ప్రతి విద్యార్థికీ మూడు జతల ఏకరూప దుస్తులు అందజేస్తామని.. విద్యార్థులు షులు, సాక్సులు కొనేందుకు డబ్బులు కూడా ఇస్తామని జగన్ చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో అక్షయపాత్ర సంస్థకు, గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలకు అప్పగిస్తామని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బోర్డింగ్, లాడ్జింగ్ కోసం ప్రతి విద్యార్థికీ ఏటా రూ.20వేలు ఇస్తామన్నారు. డిగ్రీ పట్టా తీసుకున్నాక ఉద్యోగం వచ్చే పరిస్థితి ఉండాలని.. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు.



# నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

విశాఖ సిటీః విద్యార్థులు వారి విద్యా కాలంలో చక్కగా చదువుకుని తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పోర్టు యాజమాన్యం పేర్కొంది. శుక్రవారం స్థానిక 27వ వార్డులో ఉన్న ఆర్‌బిఎం యూపీ స్కూలులో ఉన్న విద్యార్థులకు సుమారు 443 మందికి తరగతి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. విశాఖపట్నం పోర్టు యాజమాన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొని విద్యార్థులు చదువుచక్కగా చదువుకుని కలాం కలలు నిజం చేయాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, పోర్టు యాజమాన్యం తరపున కనకరాజు, ప్రసాద్, వార్డు మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్, పండరీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఆధార్‌తో ఇన్‌కమ్‌ట్యాక్స్ ఫైలింగ్

ఎక్కడైతే పాన్ నంబర్ అవసరముంటుందో.. అక్కడ ఆధార్ నంబర్‌ను పొందుపరిస్తే సరిపోతుంది అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

అలాగే ఆధార్ కార్డు ఉన్నవారు పాన్ కార్డును సులభంగా పొందేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. కొన్ని నిర్దేశించిన అధిక విలువగల లావాదేవీలకు పాన్/ఆధార్‌ను ఆర్థిక శాఖ మంత్రి తప్పనిసరి చేశారు. ఇక భారత్‌కు వచ్చే ఎన్నారైలు పాస్‌పోర్టుల సాయంతో ఆధార్‌ను నిర్ణీత 180 రోజులు వేచి ఉండాల్సిన అసవరం లేకుండానే పొందొచ్చని నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

## *దేశాభివృద్ధికి నారీ భేరీ తప్పనిసరి*

రూ.5,000 ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లోనూ స్త్రీల భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం పురుషులతో సమానంగా ఉంది. ఈ రోజున పార్లమెంటులోని ఈ సభలో 78 మంది మహిళలు ఉన్నారు అని ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు. మహిళల భాగస్వామ్యం లేకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి నోచుకోదని స్పష్టం చేశారు. సమ్మిళిత శిశు అభివృద్ధి పథకం కింద 2019-20 ఆర్థిక ఏడాదికి రూ.27,584 కోట్లు కేటాయించారు. మహిళల సంక్షేమం కోసం చేసే వనరుల కేటాయింపులను సమర్థంగా వినియోగించుకొనేందుకు నారీ తు నారాయణి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## ఎన్‌ఆర్‌ఐలకు మరిన్ని సౌకర్యాలు

వీరికి అనేక వెసులుబాటులు ఉంటాయి. వీరు తమ పెట్టుబడులను ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. అంతేకాకుండా వీరి కోరిన విధంగా డాలర్లలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. తాజాగా ఇవే నిబంధనలను ప్రవాసులకు వర్తింప చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎన్‌ఆర్‌ఐలు పెట్టే పెట్టుబడులను విదేశీ పోర్టుఫోలియోగానే గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం భారత క్యాపిటల్ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐ పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారిని ప్రోత్సహించేందుకు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్‌ల దారిలోనే ఎన్‌ఆర్‌ఐ పెట్టుబడులను పెట్టేందుకు వీలు కల్పిస్తున్నాం అని బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ తెలిపారు.

అంతేకాదు, భారత పాస్‌పోర్ట్ కలిగిన ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్‌కార్డులను జారీ చేయనున్నారు. గతంలో ఇందుకోసం 180 రోజుల పాటు వేచి చూడాల్సి వచ్చేది. అంటే, ఒక వ్యక్తి 12 నెలల కాలంలో 182 అంతకన్నా ఎక్కువ రోజులు భారత్‌లో ఉన్నవారికి మాత్రమే ఆధార్ లభించేంది. ఇక నుంచి దీనికి స్వస్తి పలికారు. భారత పాస్‌పోర్ట్‌ఉంటే చాలు ఆ వ్యక్తి ఆధార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

## *దృఢమైన భారతం కోసం..*

1 ట్రిలియన్ డాలర్లకు చేరడానికి 55ఏళ్లు పట్టింది. ఎన్డీయే అధికారంలోకి వచ్చే నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 1.85లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలోనే దేశ ఆర్థిక వ్యవస్థను లక్ష కోట్ల డాలర్లు పెంచాం. ఈ ఏడాది చివరి నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని.. త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా దేశం ఎదుగుతుంది. ఇందుకోసం వడివడిగా అడుగులు వేస్తున్నాం. తక్కువ ప్రభుత్వం.. ఎక్కువ పాలనే మా విధానం అని నిర్మలా సీతారామన్ చెప్పుకొచ్చారు.

రూ.400కోట్లతో నూతన జాతీయ విద్యావిధానం

ప్రపంచస్థాయి విద్యా సంస్థలను నెలకొల్పి, నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.400కోట్లు విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఉన్నత విద్యా కమిషన్ ముసాయిదా చట్టాన్ని సమర్పించనున్నట్లు ఆమె చెప్పారు. భారత్‌ను విద్యా హబ్‌గా మార్చి, విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు స్టడీ ఇన్ ఇండియా అనే కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద జాతీయ క్రీడా విద్యామండలిని ఏర్పాటు చేయనున్నట్లు సీతారామన్ పేర్కొన్నారు.

మహాత్మగాంధీ ఆలోచనలతో యువతను ప్రభావితం చేసి, చైతన్య పరచేందుకు గాంధీ పీడియాను అభివృద్ధి చేయనున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. రైల్వేను అభివృద్ధి చేసేందుకు సబర్బన్ రైల్వేలో ప్రత్యేక ప్రతిపాదిత వాహనాల పథకం కింద, అలాగే మెట్రో రైళ్లలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో పెట్టుబడులు పెట్టి ప్రోత్సహించనున్నట్లు ఆమె తెలిపారు.

విదేశీ ఉద్యోగాలే లక్ష్యంగా యువతకు శిక్షణ

బడ్జెట్ 2019లో యువకులకు కేంద్రం పలు కార్యక్రమాలను ప్రకటించింది. విద్యార్థులు విదేశాల్లో సైతం ఉద్యోగాలు చేసేందుకు అనుగుణంగా వారిలో నైపుణ్యాల వృద్ధికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతూ.. పనే దైవం అనే లక్ష్యంతో యువకులు, విద్యార్థులకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. పరిశ్రమ అవసరాలకనుగుణంగా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా కోటి మంది యువకులకు నైపుణ్య శిక్షణ కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల పనితీరులో వస్తున్న మార్పులకనుగుణంగా మన దేశ యువతను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరాన్ని సీతారామన్ గుర్తుచేశారు. అందులో భాగంగా కృత్రిమ మేథ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా, త్రిడీ ప్రింటింగ్, వర్చువల్ రియాలిటీ, రొబోటిక్స్ లాంటి పలు అత్యాధునిక రంగాల్లో యువకులకు శిక్షణ కల్పిస్తామన్నారు. విదేశాల్లో సైతం యువకులు ఉద్యోగాలు సంపాదించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. అలాగే రానున్న కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల కొరత ఏర్పడబోతోందని.. దాన్ని మన దేశ యువత ఒడిసిపట్టేలా శిక్షణ సాగుతుందన్నారు.

గ్రామీణానికి అంతర్జాల సేవలు వేగవంతం..

గ్రామీణ ప్రాంతాలకు అంతర్జాల సేవలను విస్తరింపచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్‌నెట్ ప్రాజెక్టును యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్ఓఎఫ్) ద్వారా వేగవంతం చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. శుక్రవారం ఆమె లోక్‌సభలో బడ్జెట్-2019ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భారత్‌నెట్ ప్రాజెక్టు గురించి వివరించారు. డిజిటలీకరణ విషయంలో గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధిగమించేందుకు భారత్‌నెట్ ద్వారా ప్రతి పంచాయతీ పరిధిలోని అన్ని స్థానిక ప్రాంతాలకు అంతర్జాల సదుపాయాన్ని కల్పించనున్నాం అని తెలిపారు.

పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో యూఎస్ఓఎఫ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అంతర్జాల సేవలు వేగవంతంగా అందుతాయి. అన్ని పంచాయతీల పరిధిల్లోని 2.5 లక్షల గ్రామాలకు మార్చి 2020లోపు అత్యధిక వేగవంతంతో అందే బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తాం అని సీతారామన్ తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్ ద్వారా ఇప్పటివరకు రెండు కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల వారికి డిటిజలీకరణ అంశాలపై అవగాహన కల్పించామని మంత్రి చెప్పారు.

## బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది

ఎంత ఇచ్చేది కానీ.. అందుకు కేటాయింపులు కానీ ఈ బడ్జెట్ లో పేర్కొనకపోవడం ఆందోళనకరం. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్ఆర్ తదితర విద్యాసంస్థలకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు నిలిచిపోయి నాలుగు నెలలైనా, ఈ బడ్జెట్లో వాటికి కేటాయింపులు చేయకపోవడం గర్హనీయం. విశాఖ, విజయవాడ మెట్రోలతో పాటు కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు తదితర అంశాలకు కేటాయింపులు జరపలేదు. ఈశాన్య రాష్ట్రాలకు కేటాయించే నిధులను బడ్జెట్‌లో చూపి వాటితో పాటు తీవ్ర ఆర్థికలోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నిధుల అంశం విస్మరించడం కేంద్రానికి తగదు. వ్యవసాయం సంక్షోభం నుంచి బయటపడేందుకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తారన్న రైతాంగం ఆశలను నీరుగార్చారు. రైతులకు సంబంధించిన కీలక అంశాల ప్రస్తావనే లేదు. నదుల అనుసంధానం, నీటిపారుదల ప్రాజెక్టులకు నిధుల కేటాయింపును పేర్కొనలేదు. వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలను బడ్జెట్ నిరాశకు గురిచేసింది. డిజిటల్ చెల్లింపులపై పన్ను ఎత్తివేత నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు మేమిచ్చిన సిఫార్సుల్లో ఇదే కీలకాంశం. దీంతో బ్యాంకు లావాదేవీల్లో పారదర్శకతతో పాటు డిజిటల్ చెల్లింపులలో వృద్ధి ఉంటుంది. ఆ సిఫార్సుల అమల్లో తీవ్రజాప్యం జరిగినా.. ఇప్పటికైనా వాటిని అమలు చేయడం అభినందనీయం అని చంద్రబాబు పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

ప్రస్తావన పెద్దగా లేదన్నారు. ఏపీ ప్రయోజనాలను కాపాడడం కోసం ఏ పోరాటానికైనా తాము సిద్ధమని, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పార్లమెంటులో ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

## డ్రాపౌట్స్ లేకుండా చూడండి

ఏటా రూ.20వేల రూపాయలు చెల్లింపుపై అధికారులతో చర్చించారు. వచ్చే జనవరి 26 నుంచి అమ్మ ఒడి అమల్లోకి రానున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యత ఉండకూడదని పేర్కొన్నారు. స్కూలు దగ్గర నుంచి తిరిగి ఉన్నత విద్య పూర్తి చేసుకునేంత వరకూ డ్రాప్ అవుట్ అన్నది లేకుండా చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయడాన్ని ఓ సవాల్‌గా తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లనీయకుండా నిరత్సాహపరించదని అన్నారు. 6, 8 నెలలు అయినా మధ్యాహ్న భోజన కార్మికులకు గత ప్రభుత్వంలో సరకులకు బిల్లులు చెల్లించని పరిస్థితి ఉండేదని విమర్శించారు. పుస్తకాలు కూడా సరిగ్గా ఇవ్వలేదని అన్నారు. ఏప్రిల్, మే, జూన్ మొదటి వారాల్లో అందాల్సిన డబ్బులు అక్టోబరు వచ్చినా అందని పరిస్థితి అని మండిపడ్డారు. పాదయాత్రలో మాకు పుస్తకాలు అందలేదని అక్టోబర్ నెలలో పిల్లలు నాకుచెప్పిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకున్నారు.

రాష్ట్రంలో 40వేల స్కూళ్లు ఉన్నాయని, ప్రతి స్కూలు ఇప్పుడు ఏస్థితిలో ఉన్నాయో ఫొటో తీసుకోమన్నామని తెలిపారు. 23 ఏళ్లలో మరొక ఫొటో తీసుకుని ప్రజలకు చూపిస్తామని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బాత్‌రూమ్స్, తాగునీరు, ఫర్నిచర్, బ్లాక్‌బోర్డ్స్, ఫ్యాన్లు, ప్రహరీ గోడలు, ఫినిషింగ్ వర్క్స్... ఇలా ప్రతి పనీ ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని అన్నారు. ప్రతి పాఠశాలను ఇంగ్లిషు మీడియం చేస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు భాషను తప్పనిసరి సబెక్ట్ చేస్తున్నామని ప్రకటించారు.

మధ్యాహ్నభోజనం నాణ్యతను బాగా పెంచుతామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన రేటును పెంచే ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి పిల్లాడికి 3 జతల యూనిఫారాలు, షులు అందిస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకే స్టిచ్చింగ్ ఛార్జీలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. పిల్లలలకు షులు, సాక్సులకోసం డబ్బులు కూడా ఇవ్వాలని తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం భోజనం అక్షయపాత్రకు, రూరల్ ప్రాంతాల్లో ఇప్పుడున్న డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అప్పగించాలని ఆదేశించారు.

ప్రతి పాఠశాలకు విద్యాకమిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాల అభివృద్ధి, పర్యవేక్షణ బాధ్యత కమిటీదేనని స్పష్టం చేశారు. రాజకీయాలకు దూరంగా విద్యా కమిటీలు ఉండాలని అన్నారు. క్రమం తప్పకుండా సమావేశమై స్కూలు బాగోగులను విద్యా కమిటీలు పర్యవేక్షించాలని తెలిపారు. స్కూల్లో బాత్‌రూమ్స్ క్లీన్ చేసేవారికి రూ.4 వేలు, క్లీనింగ్ సామాగ్రి కోసం వెయ్యి రూపాయాలు కేటాయించాలని తెలిపారు.

స్కూలు, కాలేజీ ఫీజుల మానిటరింగ్ అండ్ రెగ్యులేటరి కోసం ఒక నియంత్రణ వ్యవస్థను తీసుకొస్తున్నామని ప్రకటించారు. దీనికోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లో చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు. ఇండియాలో విద్య అనేది వ్యాపారం కాదు, సేవ మాత్రమేనని అన్నారు. రూరల్ ఎకానమీ ఉన్న దేశంలో లక్షల ఫీజులు కట్టడం కష్టమని అన్నారు. వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు.

బోర్డింగ్, లాడ్జింగ్ కోసం ప్రతి విద్యార్థికి ఏటా రూ. 20 వేలు అందిస్తామని తెలిపారు. ఏదశలో కూడా చదువు ఆపకూడదన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పేదల జీవితాలు మారాలంటే.. చదువు ఒక్కటే మార్గమని అన్నారు. ఉన్నత విద్య పూర్తైన తర్వాత ఉద్యోగాలు కల్పించాలని అన్నారు.

డిగ్రీ తీసుకున్నాక.. ఉద్యోగం వచ్చే పరిస్థితి ఉండాలన్నారు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని అసెంబ్లీ చట్టం తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓ ఇంజనీరింగ్ కాలేజ్‌ను ఎంపిక చేసుకుని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఉన్నవారికి శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, జిల్లాలో ఉన్న పారిశ్రామిక వర్గాలతో ఇంటరాక్ట్ అవుతుందని పేర్కొన్నారు. వారికి కావల్సిన నైపుణ్యం ఉన్న మానవ వనరులను అందించడానికి తగిన విధంగా ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. విద్యావ్యవస్థను తీర్చి దిద్దాలన్నదే తన కల అని, ఆ దిశగా అడుగులు వేస్తున్నానని, అందుకు అధికారుల సహకారం, ప్రోత్సాహం అవసరమని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

# మల్లన్నసాగర్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష!

హైదరాబాద్: మల్లన్న సాగర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించే విషయంలో కోర్టు ధిక్కరణకు పాల్పడిన ముగ్గురు అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముగ్గురు అధికారులకు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. తమకు పునరావాసం కల్పించకుండానే చట్టవిరుద్ధంగా మల్లన్నసాగర్ ప్రాజెక్టు పనులు చేస్తున్నారంటూ సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌కు చెందిన 70 మంది వ్యవసాయ కార్మికులు గతేడాది ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

చట్టం ప్రకారం పునరావాసం కల్పించకుండా పనులు చేపట్టవద్దని హైకోర్టు గతేడాది జులై 25న ఆదేశించింది. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుగులో సమర్పించి.. పిటిషనర్ల అభ్యంతరాలను మరోసారి స్వీకరించి నిర్ణయం ప్రకటించాలని స్పష్టంచేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి ప్రాజెక్టు పనులు చేస్తున్నారంటూ తాజాగా వేములఘాట్‌కు చెందిన 17 మంది కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు కాళేశ్వరం ప్రాజెక్టు మూడో యూనిట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న సిద్దిపేట ఆర్డీవో జయచంద్రా రెడ్డి, తొగుట తహసీల్దార్ ఎల్.వీర్ సింగ్ కోర్టు ధిక్కరణకు పాల్పడటమే కాకుండా.. న్యాయస్థానానికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు హైకోర్టు తేల్చింది. అదేవిధంగా నీటి పారుదల శాఖ గజ్వేల్ డివిజన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టి.వేణు కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు నిర్ధారించింది.

ఈ నేపథ్యంలో జయచంద్రా రెడ్డి, ఎల్.వీర్ సింగ్, టి.వేణుకు మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేలు చొప్పున జరిమానా విధించింది. వారు అప్పీల్‌కు వెళ్లేందుకు వీలుగా శిక్షను ఆరు వారాల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

# ఆ ఘటనలపై జగన్ మాట్లాడరేం?:

## మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు

ఒంగోలు: ప్రత్యర్థులు దాడిచేసి.. వివస్త్రను చేయడంతో మనస్తాపానికి గురై ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తెదేపా కార్యకర్త పద్మ కుటుంబాన్ని మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఈ మేరకు ఆయన ప్రకాశం జిల్లా చినగంజాం మండలం రుద్రమాంబపురంలోని ఆమె నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులకు తెదేపా తరపున రూ.5లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మ పిల్లల్ని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చదివిస్తామని భరోసా ఇచ్చారు. పద్మ మృతికి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఈ దాడిలో పద్మ భర్తకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనల్ని నాగరిక సమాజం ఖండించాలి. ఇలాంటివి జరుగుతుంటాయని హోంమంత్రి సుచరిత అంటున్నారు. ఈ ఘటనలపై సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎందుకు మాట్లాడరు? మనవాళ్లను కొట్టి తిరిగి మనవాళ్లపైనే కేసులు పెడతారా? రాష్ట్రంలో ఇప్పటివరకు 95 దాడులు జరిగాయి. శాంతిభద్రతల విషయంలో నేను చాలా కఠినంగా ఉన్నా. నా రక్షణ అంశంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోంది. ఈ ప్రభుత్వం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి అని చంద్రబాబు అన్నారు.

# పరిశోధనల ద్వారానే నూతన ఒరవడి

## అనాటమిస్ట్‌ల ప్రాంతీయ సందస్సులో గీతం అద్యక్షుడు శ్రీభరత్



సాగర్‌నగర్‌: నూతన వైద్యవిధానాలు, వైద్య ఉపకరణాలు అందుబాటులోకి రావాలంటే వైద్య కళాశాలలో బోధనతో పాటు పరిశోధనలు సమ స్థాయిలో జరగాలని తద్వారా నూతన ఒరవడీ సాద్యపడుతుందని గీతం అద్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్)లో అనాటమిస్ట్ సొసైటీ 18వ వార్షిక సమావేశాలను శుక్రవారం ఆయన విశిష్ఠ అతిధిగా హజరై ప్రారంభించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎమ్‌సిఐ) నిబంధనలను గౌరవిస్తూనే వైద్య రంగంలో నూతన బోధనా పద్దతులపై దృషి సారించాలని, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి వృత్తి నైపుణాలను వైద్య విద్యకు జోడిస్తే కలిగే ప్రయోజనాలను అద్యయనం చేయాలని సూచించారు.

ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.వి.రావు మాట్లాడుతూ దేశంలో 500లకు పైగా వైద్య కళాశాలలు ఉన్నప్పటికీ ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్‌ఆర్) నుంచి పరిశోధనా నిధులను పొందిన కళాశాలలు పరిమితంగా ఉన్నాయన్నారు.వైద్యఆరోగ్య రంగంలో పరిశోధనలు ప్రోత్సహించడానికి ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రత్యేక రీసెర్చి కమిటిని నియమించిందన్నారు. వైద్య పరిశోధనలకు 15 లక్షల రూపాయలు కేటాయించామని అయితే ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదన్నారు.వైద్య పరిశోధనలకు గాను విద్యార్ధులను, ఫ్యాకల్టీ సభ్యులను ప్రోత్సహించే ఉద్దేశ్యంలో ఉన్నామన్నారు. గడచిన 10 సంవత్సరాలలో వైద్యరంగం నుంచి ఒక్క పరిశోధనా పత్రం వెలువడక పోవడం విచారకరమన్నారు.వైద్య పరిశోధనలకు గాను వైద్యులు తామ చేపట్టే వివిధ కేసులను ఆధారంగా చేసుకుని సాంకేతిక పత్రాలను వెలువరించవచ్చునని సూచించారు.ఈ ఏడాది నుంచి ఎమ్‌సిఐ నిబంధనల ప్రకారం వైద్య విద్యలో కొత్త పద్దతలు అమలు చేయునున్నట్లు వెల్లడించారు.

గీతం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ బయోమెడికల్ టెక్నాలజీ వంటి కోర్సులను ప్రారంభించే ఉద్ధేశ్యంతో ఉన్నామని తెలిపారు.సాంకేతిక నిపుణులు, వైద్య నిపుణులు కలిసి పనిచేస్తే నూతన వైద్య పరికరాల తయారి సాద్య పడుతుందన్నారు. ఐఐటి లు సహితం వైద్య రంగంలో పరిశోధనలకు అశక్తి చూపతున్నాయని వెల్లడించారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ రమణి జిమ్‌సర్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎమ్.జయప్రకాష్ బాబు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎ.హిమబింధు, అనాటమి ప్రాంతీయ సంఘం అదక్షురాలు సి.హేమ తదితరులు పాల్గోన్నారు.





# నేడు హైదరాబాద్‌లో అమిత్ షా పర్యటన

హైదరాబాద్ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు, హోం మంత్రి అమిత్ షా శనివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2:40 గంటలకు షా శంషాబాద్ చేరుకోనున్నారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నోవాటెల్ హోటల్‌లో బీజేపీ ముఖ్యనేతలతో అమిత్‌షా భేటీ కానున్నారు.

ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీలో చేరే నేతల గురించి కీలకంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా రాత్రి 9గంటలకు అమిత్‌షా ఢిల్లీ బయల్దేరనున్నారు.

# మత్స్యావతారంలో జగన్నాధుడు

**పులకించిన భక్త జనం .. వైభవంగా ఆషాఢ మాసోత్సవాలు**

**ప్రారంభించిన రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు**



డాబాగార్డెన్స్: ఆషాఢ శుద్ద విదియ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశాఖనగరంలోని జగన్నాధ స్వామి భక్తులకు మత్స్యావతార రూపంలో దర్శనమిచ్చారు. వేదాలను రక్షించేందుకు శ్రీమన్నారాయణుడు మత్స్యావతారం ధరించినట్టు పురాణ కధనం.

ఒరిస్సా లోని పూరీ క్షేత్రంలో నిర్వహించే రథయాత్రను దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విశాఖ నగరంలోని జగన్నాధ ఆలయాల్లోను రథయాత్రను గురువారం సాయంత్రం రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి వైభవంగా ప్రారంభించారు. టౌన్ కొత్తరోడ్ లోని జగన్నాధ స్వామి ఆలయ ఈఓ బండారు ప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా విశాఖపట్నం టౌన్ కొత్తరోడ్ లో గల జగన్నాధ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జగన్నాధుని అవతార ఆషాఢమాసోత్సవాలు నిర్వహిస్తున్నామ న్నారు. భారీ శోభాయాత్రగా స్వామిని కొత్త రోడ్ నుంచి చౌల్ట్రీ వరకూ తీసుకు వచ్చి పది రోజుల పాటు స్వామిని దశావతారాల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం స్వామి మత్సావతారంలో దర్శనమిచ్చారన్నారు. కార్యక్ర మాల్లో భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక శీఘ్ర దర్శనం కూడా ఏర్పాటు చేసామని జగన్నాధ ఉత్సవాల సందర్భంగా చౌల్ట్రీ జాతర వాతావర ణాన్ని తలపిస్తుందని వివరించారు. ఈ ఉత్స వాల్లో ఉదయం 5 గంటల నుంచి 6 వరకూ మేలు కొలుపు, నాదస్వరం, 6 గంటల నుంచి నిత్య పూజ, గోత్ర నామాలతో అర్చనల, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, భగవద్గీత పారాయణ, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, రోజు అన్న దానం, భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు దేవా దాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. 1964 నుంచి నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ముందుగా రధో త్సవం, అనంతరం దశావతార ప్రదర్శన జరుగుతాయి.

**దశావతార వైభవం :**

దీనిలో భాగంగా జూలై 5 ( తదియ శు క్రవారము ) మత్స్యావతారము, 6న (చవితి శని వారము) కూర్మావతారము, 7 న (పంచమి అది వారం) వరాహవతారము, 8 న ( షష్ఠి సోమ వారము) న ృసింహవతారము, 9 న ( సప్తమి మంగళ వారము ) వామనావతారముతో పాటు పరశురామావతారము, 10 న ( అష్టమి, తత్కాల నవమి బుధవారం) నాడు రామావతారము, 11 న ( దశమి గురువారం) బలరామ క ృష్ణావతారము, ఆఖరు రోజైన 12 నాడు (తొలి ఏకాదశి శుక్రవారము) శేషపాన్పు అవతారంలో (పాల కడలిలో వేంచేసిన శ్రీ మహావిష్ణువు అంశ), తదుపరి భక్తులకు దర్శనం స్వామి భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఆఖరి రోజు అవతారాన్ని తదుపరి ఈనెల 13 న ద్వాదశి శనివారం రోజు భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

# రెడ్డి కులస్తుల ఐక్యత వర్ధిల్లాలి

**వేమన సంక్షేమ సంఘం (విశాఖ రెడ్డి సంఘం) నూతన కార్యవర్గం ఎన్నిక**

**ఉత్తమ జర్నలిస్టుగా ఎన్నికైన మురళీకృష్ణారెడ్డికి సన్మానం**

విశాఖ సిటీః విశాఖ జిల్లాలోని రెడ్డి కులస్తులంతా ఒకే తాటిపై నిలబడి కుల ఐక్యతకు పాటుపడాలని వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా సంఘ పెద్దలు పిలుపునిచ్చారు. శనివారం వేమన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ పెద్దలు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అదే సామాజిక వర్గానికి చెందిన గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షునిగా నీలాపు వివేకానంద రెడ్డి, గౌరవ అధ్యక్షునిగా సత్తి నాగేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులుగా గొందేశి మహేశ్వర రెడ్డి, బి. ఆంజనేయ రెడ్డి, పాల మోహన రెడ్డి, ఎస్ఆర్. గోపీనాధ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సత్తి రామకృష్ణా రెడ్డి, కార్యదర్శులుగా ఎన్.వి. రమణా రెడ్డి, టిఎస్ఎన్ సుధాకర్ రెడ్డి, కర్రి రామా రెడ్డి, డిఎస్‌వి ప్రసాద రెడ్డి, కోశాధికారిగా బాలి రెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఎన్. విజయానంద రెడ్డి తదితరులు ఎన్నుకోబడ్డారు. నూతన సంఘ సభ్యులచే కుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ సుమారు 40 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ సంక్షేమ సంఘం రెడ్డి కులస్తుల కుటుంబాలకు చేదోడువాడుగా ఉంటూ విద్యావ్యవహారాలు, వివాహ పరిచయ వేదికలు, ఇతరత్రా సంఘ అభివృద్ధి కార్యక్రమాలకు పాటుపడుతుందని తెలియజేశారు. కీ.శే. ఎన్ఎస్ఎన్ రెడ్డి మరియు నగరంలోగల ముఖ్యులు కలిసి స్థాపించిన ఈ సంఘానికి అప్పటి ప్రభుత్వం ఆశీల్‌మెట్ట వద్ద వేమన మందిరాన్ని కుల కార్యకలాపాలకు కేటాయించింది.





**2019 ఉత్తమ జర్నలిస్టు మురళీకృష్ణా రెడ్డికి సన్మానం**

ఇందులో భాగంగా రెడ్డి కులస్తుడైన దుక్కా మురళీకృష్ణా రెడ్డికి విజెఎఫ్ 2019 ఉత్తమ జర్నలిస్ట్‌గా విశాఖ క్రైం విభాగంలో ఎన్నికై విజెఎఫ్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో నగర ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్న విషయం విదితమే.

నూతన సంఘ కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా మురళీకృష్ణా రెడ్డికి ఘనంగా సన్మానించి పలువురు అభినందనలు తెలియజేశారు.

# ప్రతీ పేదవానికీ ఉచితంగా ఇల్లు

## మంత్రి బొత్స సత్యనారాయణ



అమరావతి: ఏపీలో ఇళ్లులేని పేదలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఇచ్చే ఇళ్లు పూర్తిగా ఉచితంగా నిర్మిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో స్థలం, పట్టణాల్లో జీప్లస్-3 ఇళ్లు రిజిస్ట్రేషన్ ఇస్తామని.. ఎక్కడా రూపాయి కూడా తీసుకోకుండా అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని మంత్రి తెలిపారు.

ఇళ్ల నిర్మాణంలో అవినీతికి ఆస్కారం లేకుండా చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణంలో రివర్స్ టెండరింగ్‌కు వెళ్తున్నామని మరోసారి బొత్స స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో గృహ నిర్మాణం పేరుతో భారీ కుంభకోణం జరిగిందని.. వైఎస్ హయాంలో కట్టిన 25 లక్షల ఇళ్లను టీడీపీ నిర్మించినట్టు చెప్పుకున్నారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. టెక్నాలజీ పేరుతో అధిక ధరలకు కాంట్రాక్టులు అప్పజెప్పారని మంత్రి బొత్స చెప్పు కొచ్చారు.







# ఆ నిర్ణయం.. 1,174 కంపెనీలపై ప్రభావం

దిల్లీ: క్యాపిటల్ మార్కెట్‌ను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతమున్న 25 శాతం పబ్లిక్ షేర్‌హోల్డింగ్‌ను 35 శాతానికి పెంచడానికి సెబీ చర్యలు తీసుకోవాలని నేటి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీని ప్రభావం దాదాపు 1,174 లిస్టెడ్ కంపెనీలపై పడనుంది.. వీటిలో టీసీఎస్, విప్రో, డీమార్ట్‌లాంటివి పెద్ద కంపెనీలు ఉన్నాయి.

సెంట్రమ్ బ్రోకింగ్ లిమిటెడ్ సంస్థ తాజా డేటా ప్రకారం దాదాపు 1,174 లిస్టెడ్ కంపెనీలు 65 శాతం కంటే ఎక్కువగా ప్రమోటర్ల షేర్ హోల్డింగ్స్ కలిగి ఉన్నాయి. దాదాపు రూ.3.87 లక్షల కోట్ల విలువైన ప్రమోటర్ల వాటాలను ఇవి పబ్లిక్‌కు వదిలి వేయాల్సి ఉంటుంది. వీటిలో టీసీఎస్(రూ.59,600 కోట్లు),విప్రో(రూ.15,000 కోట్లు), డీమార్ట్(రూ.14,000 కోట్లు) వాటాలు ఉన్నాయి.

కోల్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

అయితే వీటిని అమలు చేయడానికి ఎంత సమయం ఇస్తారో తెలిపే సెబీ నిబంధనల కోసం వేచి చూస్తున్నట్లు సెంట్రమ్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జగన్నాథమ్ తెలిపారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com